

జీతం పడింది..!

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అనంతపురం సెంట్రల్, మార్చి 26: మూడు నెలల తరువాత జేఎన్‌టీయూ ఉద్యోగులకు రెండు నెలల జీతాలు పడ్డాయి. నిద్రలేచినప్పటి నుంచి పడుకునే వరకు జీతాలు పడ్డాయేమో అని బ్యాంకు నుంచి వచ్చే మెసేజ్‌ల కోసం సెల్ ఫోన్‌లను పదే పదే చూస్తూ గడిపిన ఉద్యోగులు.. మంగళవారం ఊరట చెందారు. 'నాడు అంతర్జాతీయ ఖ్యాతి.. నేడు అధోగతి' శీర్షికన ఆంధ్రజ్యోతిలో మంగళవారం ప్రచురితమైన కథనానికి ప్రభుత్వం స్పందించింది. వర్సిటీ ఉన్నతాధికారులు ఆగమేఘాల మీద ఉద్యోగుల ఖాతాలలో రెండు నెలల జీతాలను జమ చేశారు. దీంతో వర్సిటీ ఉద్యోగ వర్గాలు ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు తెలిపాయి. నేడో, రేపో ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతాలను కూడా చెల్లిస్తారని సమాచారం.

ఎన్నికల ప్రచారం కోసం వైసీపీ వ్యూహం

వచ్చే నెల పింఛన్ల పంపిణీ తరువాత ముహూర్తం


అంతవరకూ ఫొటోలకు దొరక్కుండా ప్రచారం చేస్తారట..!


దర్గాహొన్నూరులో రాజీనామా చేస్తున్న వలంటీర్లు (ఫైల్)

వలంటీర్ల రాజీనామాలు


ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేశారు. ఇంటింటికీ వెళ్లి పింఛన్లను పంపిణీ చేశారు. ఏ అవసరానికైనా తామున్నామంటూ వలంటీర్లు స్థానికంగా పనిచేశారు. బదులుగా.. ప్రభుత్వం నుంచి పారితోషికం తీసుకున్నారు. లెక్క ప్రకారం వీరు ప్రభుత్వంలో భాగం. ఏ రాజకీయ పార్టీలకీ పని చేయకూడదు. కానీ కొందరు వలంటీర్లు అధికార పార్టీవారి ఆదేశాలను పాటిస్తున్నారు. ఆ పార్టీ అభ్యర్థుల కోసం ప్రచారం చేసి.. ఉద్యోగాలను పోగొట్టుకుంటున్నారు. తాజాగా అధికార పార్టీవారి సూచన మేరకు రాజీనామా చేసేందుకూ సిద్ధమవుతున్నారు. 'ఏం పరవాలేదు.. గెలిచాక మళ్లీ మీరే వలంటర్లు..' అని వైసీపీవారు మభ్యపెడుతున్నారు. కానీ గెలవక పోతే..? అధికారం చేతులు మారితే..? చట్ట విరుద్ధంగా వ్యవహరించినందుకు చర్యలు తప్పకపోతే..? అప్పుడు వలంటీర్లను కాపాడేదెవరు..? కూటమి అధికారంలోకి వచ్చాక వలంటీర్లకు అండగా ఉంటామని, మరింత గౌరవిస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు స్పష్టంగా ప్రకటించారు. వలంటీర్లు పునరాలోచన చేయాలని పలువురు సూచిస్తున్నారు.

రాయదుర్గం, మార్చి 26: ఎన్నికల్లో గెలిచేందుకు వైసీపీ కొత్త ఒరవడికి తెరలేపింది. వలంటీర్లను ఎన్నికల వారియర్‌లుగా వాడుకుంటోంది. వారి వద్ద ఉన్న సమాచారం, ఓటర్లతో ఉన్న సంబంధాలను వాడుకుని మళ్లీ గద్దెనెక్కాలనే ఏకైక లక్ష్యంతో వ్యూహాలను అమలు చేస్తోంది. రాజకీయ పార్టీల కార్యక్రమాలకు వలంటీర్లు దూరంగా ఉండాలని ఎన్నికల కమిషన్ ఆదేశించింది. ధిక్కరించి ప్రచారంలో పాల్గొంటున్నవారిపై అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కానీ వైసీపీని గెలిపించే బాధ్యతను అధికార పార్టీ నాయకులు వలంటీర్లకే అప్పగిస్తున్నారు. 'అధికారులు చర్యలు తీసుకోవడం ఏమిటి..? మీరే రాజీనామా చేయండి. పార్టీ కోసం పనిచేయండి. గెలిచిన తరువాత తిరిగి వలంటీర్లుగా తీసుకుంటాం..' అని ప్రలోభపెడుతున్నారు. పలువురు వలంటీర్లపై ఒత్తిడి తెచ్చి మరీ రాజీనామా చేయించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో చాలా మంది వలంటీర్లు మూకుమ్మడి రాజీనామాలకు సిద్ధపడుతున్నట్లు తెలిసింది.


రాజీనామా లేఖ

ఏప్రిల్ 5న రాజీనామాలు..?

వలంటీర్లను ఎన్నికల్లో క్రియాశీలకంగా వినియోగించుకోవాలని నిర్ణయించుకున్న వైసీపీ, వారిచేత రాజీనామా చేయించి.. లబ్ధిపొందే దిశగా అడుగులు వేస్తోంది. ఏప్రిల్ 5వ తేదీ నుంచి రాజీనామాలను సమర్పించాలని అంతర్గతంగా ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. వలంటీర్లకు ప్రభుత్వం అప్పగించిన బాధ్యతలను మార్చి నెలకు సంబంధించి పూర్తిగా నిర్వర్తించి, ఏప్రిల్ 5వ తేదీ నాటికి పింఛన్ల పంపిణీని ముగించాలని, ఆ తరువాత రాజీనామా చేయించాలని భావిస్తున్నారు. ప్రభుత్వం వారికి చెల్లించే గౌరవవేతనం కూడా ఏప్రిల్ 5వ తేదీ నాటికి ఖాతాల్లో జమ అవుతుందని వైసీపీ నాయకులు వలంటీర్లకు చెప్పినట్లు తెలిసింది. అధికార పార్టీకి వంతపాడుతున్న వలంటీర్లు రెండు నెలల కోసం రాజీనామాలు చేద్దాం.. అన్నట్లు వ్యవహరిస్తున్నారు. గ్రామాల్లో ఇప్పటివరకు వలంటీర్లపై పెత్తనం సాగించిన వైసీపీ నాయకులకు రాజీనామాలు చేయించే బాధ్యతను అప్పగించినట్లు తెలిసింది.





ఆ మండలంలో..

రాయదుర్గం నియోజకవర్గంలో వైసీపీ అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి తరఫున పలువురు వలంటీర్లు ప్రచారం చేస్తున్నారు. బొమ్మనహాళ్ మండలంలోని దర్గాహోన్నూరు గ్రామంలో ఏకంగా 33 మంది వలంటీర్లు తాము రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించి, గ్రామ సర్పంచ్‌కు రాజీనామా పత్రాలను సమర్పించారు. మెట్టు గోవిందరెడ్డి తనయుడు మెట్టు విశ్వనాథ్‌రెడ్డితో కలిసి ప్రచారంలో పాల్గొంటున్నారు. రాయదుర్గం నియోజకవర్గంలోని కణేకల్లు, బొమ్మనహాళ్, గుమ్మఘట్ట, డి.హీరేహాళ్ మండలాలలో పలువురు వలంటీర్లు ఎన్నికల నిబంధనలను గాలికి వదిలేస్తున్నారు. ప్రచారంలో పాల్గొన్న కొందరిని ఇప్పటికే అధికారులు విధుల నుంచి తొలగించారు. దీంతో తొలగించక మునుపే రాజీనామా చేసి, రాజకీయ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు కొందరు వలంటీర్లు సిద్ధమౌతున్నారు.

దూరంగా ఉండండి..

ఎన్నికల ప్రచారానికి వచ్చిన వైసీపీ అభ్యర్థి, నాయకుల వెంట నడిచే వలంటీర్లు.. ఫొటోలు, వీడియోలకు దూరంగా ఉండాలని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు. ఫొటోలు, వీడియోలకు దూరంగా ఉంటేతప్ప తాము రక్షించలేమని కొందరు అధికారులు అధికార పార్టీ నాయకులకు స్పష్టం చేసినట్లు తెలిసింది. దీంతో రాజీనామాలు సమర్పించే వరకు జాగ్రత్తగా ఉంటూనే.. ఎన్నికల ప్రచారంలో పాల్గొనాలని సూచిస్తున్నారు. ఇప్పటివరకు ఎన్నికల ప్రచారంలో పాల్గొని, ఉద్యోగాలు కోల్పోయిన వలంటీర్లను అధికారంలోకి వచ్చాక తిరిగి తీసుకుంటామని అభయం కూడా ఇస్తున్నారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాలలో వలంటీర్లు అన్నీ తామై ప్రచారాలు నిర్వహిస్తున్నారు.

కాలనీలు.. కన్నీళ్లు..!

- కొడిమి పంచాయతీలో దుర్భర పరిస్థితులు
- తాగునీరు లేదు.. రోడ్లు, డ్రైనేజీ కాలువలూ లేవు
- టీడీపీ హయాంలో సీసీ రోడ్ల నిర్మాణం
- వైసీపీ అధికారం చేపట్టాక ఒక్క పనీ చేపట్టలేదు


జ్యోతిబసు కాలనీలో నిరుపయోగం ఉన్న నీటిట్యాంకు.. చుట్టూ అపరిశుభ్రత

అనంతపురం రూరల్, మార్చి 26: వైసీపీ పాలనలో కొడిమి కాలనీల అభివృద్ధి అటకెక్కింది. గత ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి మినహా.. ఆ కాలనీలో ఇతర పనులు ఏవీ జరగలేదు. కాలనీలో ఏ వీధికి వెళ్లినా టీడీపీ హయాంలో నిర్మించిన సీసీ రోడ్లే కనిపిస్తాయి. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఒక్క కాలనీలోనూ రోడ్లు వేయలేదు. ఐదేళ్ల కాలంలో చిన్నపాటి సీసీ రోడ్డు, ఒకటి రెండు మట్టి రోడ్లతో సరిపెట్టారు. దీంతో మౌలిక వసతులు లేక కాలనీల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

సమస్యల నిలయాలు

కొడిమి పంచాయతీ పరిధిలో దర్గా కొట్టాల, ఆటోనగర్, ప్రజాచైతన్య కాలనీ, జ్యోతిబసు కాలనీ ఉన్నాయి. వీటి పరిధిలో దాదాపు వెయ్యి కుటుంబాలు నివసిస్తున్నాయి. తాగునీరు, విద్యుత్, మురుగు నీటి కాలువలు వంటి సమస్యలతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. దర్గా కొట్టాల అభివృద్ధికి అమడదూరంలో ఉంది. రోడ్లు, కాలువలు వంటి కనీస మౌలిక వసతులు లేవు. విద్యుత్ స్తంభాలు లేనికారణంగా కర్రలపైనే ఇళ్లకు విద్యుత్ తీగలు ఏర్పాటు చేసుకున్నారు. తాగునీటి మోటార్లు చెడిపోయాయి. అయినా స్థానిక ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. కాలనీవాసులే సొంతంగా డబ్బులు పెట్టుకుని మరమ్మతులు చేయించుకుంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో నీటి సరఫరా నిమిత్తం ఏర్పాటు చేసిన ట్యాంకులు నిరుపయోగంగా మారాయి. ట్యాంకుల వద్ద అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. జ్యోతిబసు కాలనీ, ప్రజాచైతన్య కాలనీలో మురుగునీటి వ్యవస్థ అధ్వానంగా ఉంది. కాలువలు లేనికారణంగా మురుగునీరు ఇళ్ల మధ్యనే నిల్వ ఉంటోంది. దీంతో దోమలు ప్రబలుతున్నాయి. దుర్వాసనతో జనం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

టీడీపీ హయాంలో..

జ్యోతిబసు, ప్రజాచైతన్య కాలనీ, ఆటోనగర్ కాలనీల్లో టీడీపీ హయాంలో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. రూ.74 లక్షలతో సీసీ రోడ్లు వేశారు. ఆ రోడ్లే లేకపోతే కాలనీల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉండేది. ఇటీవల సిండికేట్ నగర్‌లో జరిగిన పార్టీ కార్యక్రమంలో జ్యోతిబసు కాలనీ మహిళలు వైసీపీ నాయకులను నిలదీశారు. దీంతో ఆటోనగర్‌లో ఒక సీసీ రోడ్డు, రెండు మట్టి రోడ్లు, జ్యోతి బసు కాలనీలో కల్వర్టులు నిర్మించారు. అదీ.. ఎన్నికల సమయం కావడంతో స్పందించారని మహిళలు విమర్శిస్తున్నారు.

పట్టించుకోవడం లేదు..



కాలనీ ఏర్పాటైనప్పటి నుంచి ఇక్కడే ఉంటున్నారు. కాలనీ ఏర్పడి ఎనిమిదేళ్లు దాటింది. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి పనులు తప్ప.. వైసీపీ అధికారంలోకి వచ్చాక చేసింది ఏమీ లేదు. బోరు చెడిపోయినా పాలకులు పట్టించుకోవడం లేదు. మేమే డబ్బులు పెట్టి మరమ్మతులు చేయించుకుంటున్నాం. స్థానిక నాయకులను కాలనీ సమస్యల గురించి మాట్లాడవద్దని, తమకు అవసరం లేదని అంటున్నారు.

- గోపాల్, ఆటోనగర్


కాలనీలోకి వెళ్లేందుకు గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన బ్రిడ్జి

వీధిలైట్లను కూడా మార్చరు..



కాలనీల్లో మూడువందల కుటుంబాలు నివాసముంటున్నాయి. గత ప్రభుత్వ హయాంలో వేసిన రోడ్లు తప్ప ఒక్క అభివృద్ధి పనికూడా జరగలేదు. వీధిలైట్లు పోయినా మార్చే పరిస్థితి లేదు. వీధి కొళాయిలకు ట్యాపులుపోతే కూడా మార్చడం లేదు. మేమే వాటిని కొని బిగించుకుంటున్నాం. రోడ్లను ఊడ్చేవారు లేరు. మా గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు.

- మహేష్, ప్రజాచైతన్య కాలనీ


ఇళ్ల వెనుక వైపు నిల్వ ఉన్న మురుగునీరు

ఉష్ణోగ్రతలు (మంగళ)

గరిష్ఠం : 40.0
కనిష్ఠం : 24.0



ఇఫ్తార్	సోమవారం సాయంత్రం	06:33
సెహరీ	మంగళవారం ఉదయం	05:02

అంజలి మరణం

కేసు నమోదు చేసిన వన్‌టౌన్ పోలీసులు.. మృతదేహానికి పోస్టుమార్టం చేయిస్తాం: సీఐ

అనుమానాస్పదం


బాధిత చిన్నారులతో ఐసీడీఎస్, పోలీసు అధికారులు

అనంతపురం క్రైం/కల్చరల్, మార్చి 26: నగరంలోని షికారు కాలనీకి చెందిన గర్భిణి అంజలి మరణంపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఆమెది అనుమానాస్పద మృతి అని కేసు నమోదు చేశారు. ఖననం చేసిన మృతదేహానికి పోస్టు మార్టం నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వన్‌టౌన్ సీఐ రెడప్ప తెలిపారు. అంజలిని భవన నిర్మాణ పనుల నిమిత్తం బేల్దారి బాలు ఈ నెల 23వ తేదీ ఉదయం 9 గంటలకు ఆటోలో పిలుచుకువెళ్లారని సీఐ తెలిపారు. అదేరోజు రాత్రి 8 గంటల సమయంలో కొందరు ఆమెను ఇంటి వద్ద వదిలి వెళ్లారని కుటుంబ సభ్యులు తెలిపారని అన్నారు. ఆరాత్రి అంజలి, రాజు దంపతులు తీవ్రంగా గొడవపడినట్లు ప్రాథమిక విచారణలో తేలిందని, ఆ మరుసటి రోజు తెల్లవారుజామున అంజలి మృతి చెందిందని సీఐ వివరించారు. సాయి ట్రస్టు ఆధ్వర్యంలో అంజలి మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారని తెలిపారు. ఐసీడీఎస్ అధికారులతో కలిసి మృతురాలి కుటుంబ సభ్యులను విచారించామని తెలిపారు. కేసును అన్ని కోణాల్లో విచారించి, చట్టపరంగా చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు.

చిన్నారులకు ఆశ్రయం

అంజలి బిడ్డలకు ఆశ్రయం కల్పించాలని ఐసీడీఎస్ అధికారులను కలెక్టర్ గౌతమి ఆదేశించారు. దీంతో ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి బాధిత చిన్నారులను, సీఐ రెడ్డప్ప, సాయి ట్రస్టు అధ్యక్షుడు విజయసాయికుమార్‌ను తన కార్యాలయానికి పిలిపించుకున్నారు. జరిగిన ఘటన గురించి విచారించారు. అనాథలుగా మారిన చిన్నారులకు తాత్కాలిక ఆశ్రయం కల్పించారు. అంజలి కుమారులు చరణ్, సాయితేజను రోటరీపురం వద్ద గల జీవని అనాథాశ్రమంలో చేర్పించారు. కూతురు అఖిలను కలెక్టరేట్ వెనుక గల బాలసదన్‌లో చేర్పించారు. ఆర్డీఓ శ్రీనివాసులు చిన్నారులకు వస్త్రాలు, స్వీట్లు అందించారు. చిన్నారులకు తాత్కాలికంగా ఆశ్రమాల్లో ఆశ్రయం కల్పించామని, వీలైనంత త్వరలో వారి విద్యాభ్యాసం కోసం శాశ్వత ఆశ్రయం కల్పిస్తామని పీడీ శ్రీదేవి తెలిపారు.

తాగునీటి ఎద్దడి రాకూడదు

సమస్య ఉంటే ట్యాంకర్లను వాడండి

అధికారులకు కలెక్టరు గౌతమి ఆదేశం


సమావేశంలో కలెక్టరు గౌతమి

అనంతపురం టౌన్, మార్చి 26: వేసవి నేపథ్యంలో జిల్లాలో ఎక్కడా తాగునీటి ఎద్దడి రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టరు గౌతమి అధికారులకు ఆదేశించారు. కలెక్టరేట్‌లో తాగునీటి సమస్యపై మంగళవారం ఆమె సమీక్ష నిర్వహించారు. తాగునీటి పథకాల పరిస్థితి, నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్న ప్రాంతాల గురించి అడిగి తెలుసుకున్నారు. సమస్య పరిష్కారం కోసం కార్యాచరణ సిద్ధంచేయాలని సూచించారు. అవసరమైన నిధులు అడిగిన వెంటనే ఇస్తామని తెలిపారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో తాగునీటి సరఫరాకు సంబంధించి ఎలాంటి పరిస్థితి ఎదురైనా ఎదుర్కొనేందుకు నిత్యం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తాగునీటి పనులు ఏవీ కూడా పెండింగ్ ఉండకూడదని, మంజూరైన పనులను ప్రాధాన్యం ప్రకారం త్వరగా చేపట్టాలని ఆదేశించారు. అనంతపురం, గుంతకల్లు, తాడిపత్రి, రాయదుర్గం, గుత్తి, కళ్యాణదుర్గం మున్సిపాలిటీల పరిధిలో నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాయదుర్గం ప్రాంతంలోనే ఎక్కువ సమస్యలు వస్తున్నాయని, అక్కడ ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. పంచాయతీల పరిధిలో ఉన్న తాగునీటి పథకాల మరమ్మతులను చేపట్టాలని, తాగునీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలకు ట్యాంకర్ల నీటిని సరఫరా చేయాలని సూచించారు. జిల్లా, మున్సిపాలిటీ స్థాయిలో నీటి సమస్యలను తెలుసుకుని, పరిష్కరించడం కోసం ప్రత్యేక కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కంట్రోల్ రూమ్స్‌కు వచ్చిన ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకుని పరిష్కరించాలని సూచించారు. అవసరమైన చోట్ల కొత్తబోర్లు వేయించాలని, పైపులైన్స్ వేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. నీరు వృథా కాకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. వేసవి ముగిసే వరకూ ప్రతి అధికారీ నిరంతరం నిఘా ఉంచాలని కలెక్టరు సూచించారు. సమీక్షలో జడ్పీ సీఈఓ షైక్‌ఫోమ్ నిదియా, నగరపాలిక కమిషనర్ మేఘ స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

ఇక మీ ఇష్టం..!

అభ్యర్థిని మార్చండి.. లేదంటే శ్రావణిని గెలిపిస్తాం


శింగనమల మండలంలోని శివపురం పెద్దమ్మ ఆలయం వద్ద సమావేశమైన వైసీపీ అసమ్మతి నాయకులు

- పెద్దమ్మ సాక్షిగా చెబుతున్నాం.. డిపాజిట్ కూడా రాదు
- సీఎం జగన్‌కు శింగనమల అసమ్మతి నాయకుల అల్టిమేటం
- బల్లా కన్వెన్షన్‌లో సమావేశానికి పోలీసుల అడ్డంకి
- శివపురం పెద్దమ్మ ఆలయం వద్దకు మారిన సీన్

శింగనమల, మార్చి 26: వైసీపీ అసమ్మతి నాయకులు పార్టీ శింగనమల నియోజకవర్గ అభ్యర్థికి వ్యతిరేకంగా మరోమారు సమావేశమయ్యారు. భారీ జనసమీకరణతో బల నిరూపణకు పూనుకున్నారు. వారి ప్రయత్నాలను ప్రభుత్వ సలహాదారు, సిట్టింగ్ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి భర్త ఆలూరు సాంబశివారెడ్డి అడ్డుకునే ప్రయత్నం చేశారు. అనంతపురం నగరంలోని బల్లా కన్వెన్షన్‌లో జరగాల్సిన సమావేశానికి అనుమతి లేదన్న కారణం చూపి.. పోలీసుల ద్వారా అడ్డుకున్నారు. దీంతో అసమ్మతి నాయకులు శింగనమల మండలంలోని శివపురం పెద్దమ్మ గుడివద్ద సమావేశమై.. తమ గళం వినిపించారు. పార్టీ అభ్యర్థి వీరాంజినేయులు మార్చాలని, లేకపోతే టీడీపీ అభ్యర్థి బండారు శ్రావణి శ్రీని గెలిపిస్తామని హెచ్చరించారు.

అధినాయకత్వంపై తిరుగుబాటు

శింగనమల నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యే పద్మావతి, ఆమె భర్త, ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి నాయకత్వాన్ని వైసీపీలోని మెజార్టీ వర్గం వ్యతిరేకిస్తోంది. పార్టీ కోసం పనిచేసిన తమను ఐదేళ్లపాటు పట్టించుకోలేదని, బంధువర్గానికి పెద్ద పీట వేశారని పార్టీలోని ద్వితీయ శ్రేణి నాయకులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఈ కారణంగానే సిట్టింగ్ ఎమ్మెల్యేకి ఈ ఎన్నికల్లో టిక్కెట్ దక్కలేదు. కానీ, వారు చూపించిన వ్యక్తికే పార్టీ టిక్కెట్ కేటాయించారు. వైసీపీ అభ్యర్థిగా ప్రకటించిన వీరాంజినేయులు ఆలూరు సాంబశివారెడ్డి సొంత మనిషి. దీంతో ఆయన అభ్యర్థిత్వాన్ని అసమ్మతి వర్గం వ్యతిరేకిస్తోంది. ఈ క్రమంలో పలుమార్లు సమావేశాలు నిర్వహించి.. అభ్యర్థిని మార్చాలని డిమాండ్ చేసింది. అయినా పార్టీ అధినాయకత్వం పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో అనంతపురం నగరంలోని బల్లా కన్వెన్షన్‌లో మంగళవారం అసమ్మతి నాయకులు సమావేశమై.. భవిష్యత్తు కార్యాచరణ ప్రకటించాలని నిర్ణయించుకున్నారు. అయితే, ఈ సమావేశానికి అనుమతి లేదని పోలీసులు బల్లా కన్వెన్షన్‌ను మంగళవారం ఉదయమే తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఈ పరిణామాలను ముందే ఊహించిన అసమ్మతి నాయకులు.. ప్రత్యామ్నాయంగా శివపురం పెద్దమ్మ గుడి వద్ద సమావేశం నిర్వహించారు.





బల్లా కన్వెన్షన్ హాల్ వద్ద పోలీసులు

శ్రేణులతో చర్చించరా..?

శింగనమల అభ్యర్థిని ప్రకటించే ముందు పార్టీ శ్రేణుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోలేదని అసమ్మతి వర్గం నాయకులు సత్యనారాయణరెడ్డి, నారాయణరెడ్డి, మిద్దె కుళ్లాయప్ప తదితరులు అన్నారు. ఎవరితో చర్చించకుండా, సాంబశివారెడ్డి చూపించిన వ్యక్తికి టిక్కెట్ ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. 'వెంటనే అభ్యర్థిని మార్చండి. వేరే అభ్యర్థిని ప్రకటించండి. లేకపోతే పార్టీ అభ్యర్థికి డిపాజిట్ కూడా దక్కదు. పెద్దమ్మ సాక్షిగా చెబుతున్నాం..' అని సీఎం జగన్‌ను హెచ్చరించారు. సాంబశివారెడ్డి నియంతలాగా వ్యవహరించారని, ఈ విషయాన్ని పలుమార్లు పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లామని అన్నారు. వైసీపీ అభ్యర్థి వీరాంజినేయులుకు వ్యతిరేకంగా నిర్వహించిన ఈ సమావేశానికి నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు మూడు వేల మంది కార్యకర్తలు హాజరయ్యారు. అసమ్మతి వర్గం సమావేశం విజయవంతమైతే తనకు ఇబ్బందులు వస్తాయని భావించిన సాంబశివారెడ్డి, పోలీసుల ద్వారా భగ్నం చేసేందుకు ప్రయత్నించారని సమాచారం. ఈ క్రమంలో బల్లా కన్వెన్షన్‌కు పోలీసులు తాళం వేశారు. సమావేశానికి వస్తున్న పలువురిని బుక్కరాయసముద్రం సమీపంలో అడ్డుకుని, వెనక్కు పంపారు. అయినా అసమ్మతి నాయకులు వెనక్కు తగ్గలేదు. పెద్దమ్మ ఆలయం వద్దకు శ్రేణులను పిలిపించి తమ గళం వినిపించారు. సమావేశంలో మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్‌లు సత్యనారాయణరెడ్డి, నారాయణరెడ్డి, పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మిద్దె కుళ్లాయప్ప, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి చాములూరి రాజుగోపాల్, తరిమెల వంశీ గోకుల్‌రెడ్డి, జడ్పీ వైస్ చైర్‌పర్సన్ నాగ రత్నమ్మ, బుక్కరాయసముద్రం ఎంపీపీ సునీత, నాయకులు పట్నం నగేష్, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈతూరి ఓటెవ్వరికి యేద్దాం?

సాధారణ ఎన్నికలు దగ్గరపడుతున్నాయి. గ్రామాల్లో రైతులు సైతం ఎలక్షన్ల గురించి చర్చించుకుంటున్నారు. టీడీపీ, వైసీపీ పాలనలో జరిగిన మంచి, చెడుల గురించి ఓ చింత చెట్టు కింద అరుగుమీద కూర్చొని ఇద్దరు ఇలా మాట్లాడుకుంటున్నారు. అనంతపురం అర్బన్



నారప్ప : ఏం శీనప్పా.. పోయినసారి ఎలచ్చన్లప్పుడు మన రైతులకు అండగా ఉంటానని సెబితే నమ్మాం. ఒగ శాన్సు ఇయ్యండి అంటే యనకా ముందూ సూసుకోకుండా జగన్ పార్టీని గెలిపించాం. ఈతూరు ఎవురికి ఓట్లేద్దామంటావ్..?

శీనప్ప: ఏందప్పా అన్ని తెలిసీ నన్ను అడుగుతాండావ్! ఐదేండ్లు మనం పడిన కట్టాలు నీకు తెల్దాఏందీ. ఇంత అన్యాయం జరిగాక ఇంగా ఎవురికి ఓటేద్దామని అడుతాండావే !

నారప్ప: ఊరికే లేప్పా.. నువ్వేమంటావో కనుకుందామని అడిగినా.

శీనప్ప: లేదులే నారప్పా ఏమన్నా గాని సెంద్రబాబు ఉన్నప్పుడు టాక్టర్లు ఇచ్చాడు. గొర్రు, గుంటక, మడకలు... ఇంగా పనికొచ్చేవి శానా సబ్సిడీతో ఇచ్చాడు కదా. జగన్ అవన్నీ ఎత్తేశాడుగదా నీకు తెలిదా ఏందీ..?

నారప్ప: అంతే కాదురా సీనా.. వాన రాక పంటలు ఎండిపోతాంటే సెంద్రబాబే మన జిల్లాలోనే కూర్సోని రచ్చక తడులు అందించాడు కదరా మర్సిపోయినావా ఏందీ? డిప్పు, సింకర్లు అడిగోనోల్లందరకీ 90 శాతం సబ్సిడీతో ఇచ్చాడు కదా. ఎస్సీ, ఎస్టీ వోళ్లకైతే ఉద్దరగా ఇచ్చినాడు. ఇప్పుడు జగనొచ్చినంక ఏందీ ఈలేదు.

శీనప్ప: ఏమోరా.. నారప్ప జగన్ మాట్లు నమ్మి ఓట్లేత్తిమి... గానీ ఇంత మోసం సేత్తాడనుకోలేదురా.. మన రైతులకు ఏమీ పతకాలు ఈలేదు. ఊర్లోనే రైతు భరోసా కేంద్రం పెట్టి ఇత్తనాలు, ఎరువులు ఇత్తానన్నాడు. ఏంటివో పనికిరాన సెనిక్కాయ ఇత్తనాలు ఇచ్చినారు. ఎరువులకు లెక్కగట్టి ఎన్నాళ్లకోగాని ఈలేదు.

నారప్ప: ఈయప్ప ఒచ్చినంక ఇన్‌పుట్ సబ్సిడీ ఒగసారి గూడా ఈలేదు. ఇంచూరంచు గూడా ఎవురికో వాళ్లకు అనుకూలమనోళ్లకే ఇచ్చినారు. మనట్లావాళ్లకు అంతేలే.


శీనప్ప: అదికాదురా నారప్ప మన్న నుచ్చు ఒత్తి ఇడదల చేశానన్న ఇన్‌పుట్ సబ్సిడీ, సున్నా వడ్డీ లెక్క నీ అకౌంట్లో పడింద్యా. నాకేమో ఇంగా పల్లేదు.

నారప్ప : అదిగాదురా నువ్వు ఒగ మాట సెప్పు జగన్ సెప్పిన యా మాట నిలబెట్టుకున్నాడ్రా? అన్ని ఉత్త మాట్లే.

శీనప్ప: సూడు నారప్ప. జగన్‌పార్టీ వోళ్లు ఓ పెద్ద ప్యావరు తీసుకొచ్చి ఇవన్నీ ఇచ్చినాము కదా ఈతూరి మాకే ఓటెయ్యాళ్ల అని అడుగుతాండారు. ఏమీసెయ్యనోల్లకు ఎట్లరా మల్లా ఓటేసేది?

నారప్ప: వాళ్లు ఎన్నిసెప్పినా ఈతూరి ఎవురూ నమ్మరులేప్పా. ఇంగా ఎలచ్చన్లు రెన్నెల్లు ఉండాయి గదా అప్పుడికి సూడచ్చులే. నరేలే బువ్వాకిలైతాంది పొయ్యొత్తా.

శీనప్ప: సర్లే నారప్ప పోయిరా. నేను ఇంటికిబోతా.



ఎంపీఆర్ కట్టపైన నిర్మించిన నీటి సంపు

ఎన్నాళ్లీ దాహం..?



- మిడ్‌పెన్నార్ ప్రాజెక్టుపై వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం
- ఆగిపోయిన పనులు..
- పల్లెలకు తప్పని నీటి కష్టాలు

గార్లదిన్నె, మార్చి 26 : మండల పైభాగానే ఎంపీఆర్ జలాశయం. జలాశయం వద్దనే తాగునీటి ప్రాజెక్టు నిర్మాణం. తమ దాహం తీరనుందని సమీప గ్రామాల ప్రజలు ఎంతో సంతోషించారు. టీడీపీ హయాంలో తాగునీటి ప్రాజెక్టు పనులు ప్రారంభమై ఆఘమేఘాల పనులు సాగాయి. వైసీపీ హయాంలో పనులు నత్తనడకన సాగాయి. ఇప్పటి వరకు 80శాతం పనులు మాత్రమే జరగడంతో కోట్లాది రూపాయల ప్రజాధనం వృధా అయ్యింది. వైసీపీ ప్రభుత్వం కాలపరిమితి ముగుస్తున్నా ప్రాజెక్టును పనులు నేటికీ పూర్తికాకపోవడంపై ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు. తాగునీటి ప్రాజెక్టు పూర్తయ్యేదెన్నడు... గుక్కెడు నీరు అందేదెన్నడు... గ్రామీణ ప్రజల దాహం తీరేదెన్నడు.. అని నిప్పులు చెరుగుతున్నారు.



పైపులైన్

- మండలంలోని పలు గ్రామాలకు తాగునీటిని అందించి వారి దాహం తీర్చేందుకు టీడీపీ ప్రభుత్వ హయాంలో 2017వ సంవత్సరంలో ఎంపీఆర్ ఆనకట్టపై ప్రభుత్వం సుమారు రూ. 40 కోట్లతో మిడ్ పెన్నార్ తాగునీటి ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. ఈ ప్రాజెక్టు ద్వారా ఎంపీఆర్ డ్యాంలోని నీటిని ఫిల్టర్ చేసి సంపులు, వాటర్ ట్యాంకులు, పైపులైన్ల ద్వారా పలు గ్రామాల మీదుగా కల్లూరు వరకు తాగునీటి సరఫరా చేసేందుకు ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపట్టారు. అయితే అ ప్రాజెక్టు పనులు టీడీపీ హయాంలో వేగవంతంగా జరిగాయి. వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రాజెక్టు పనులు చతికిలపడ్డాయి. నేటికీ ప్రాజెక్టు పనులు పూర్తి కాలేదు. ఇప్పటికే ప్రాజెక్టు పనుల గడువును రెండు సార్లు పొడిగించినా పల్లె గొంతు ఎండక తప్పలేదు. విద్యుత్ అంతరాయం, పైపులైన్ల మరమ్మతులతో పల్లెల్లో తాగునీటి సమస్యలు ఎదురవుతూనే ఉన్నాయి. తాగునీటి ప్రాజెక్టు పూర్తి చేయడంలో ఇటు కాంట్రాక్టర్లు... అటు అధికారుల నిర్లక్ష్యం ప్రజల పాలిట శాపంగా మారింది. ఏటా వేసవిలో ఈ ప్రాజెక్టు పనులను సంబంధిత అధికారులు నామమాత్రంగా పరిశీలించడం ఆనవాయితీగా మారింది. పరిశీలనలతో అధికారులు కంటితుడుపు చర్యలు చేపట్టి చేతులు దులుపుకుంటున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రాజెక్టు ఎప్పుడు పూర్తి అవుతుంది... తాగునీటి సమస్య తీరుతుందని ప్రజలు ఎదురు చూస్తున్నారు.



ఎంపీఆర్ కట్టపై నిర్మిస్తున్న తాగునీటి ప్రాజెక్టు



ఎంపీఆర్‌లో ఫిల్టర్ సంపు

ప్రాజెక్టు పూర్తయితేనే దాహం తీరుతుంది..

చాంద్‌బాషా, కల్లూరు



ఎంపీఆర్ డ్యాం తాగునీటి ప్రాజెక్టు పూర్తయితేనే కల్లూరు ప్రజల దాహం తీరుతుంది. ఏటా వేసవిలో కల్లూరులో తాగునీటి సమస్య జఠిల మవుతోంది. ముఖ్యంగా కొండకింద నీటి సమస్య తీవ్రమవుతోంది. బిందెడు నీటి కోసం కొళాయిల వద్ద గంటల తరబడి నిలబడాల్సి వస్తోంది. ప్రాజెక్టు పనులు మొదలు పెట్టి ఏళ్ళు గడుస్తున్నా నేటికి నీరు సరఫరా కాలేదు. ప్రాజెక్టు పనులు త్వరగా పూర్తి చేసి గ్రామాలకు తాగునీటి సమస్య పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పాలకుల వైఫల్యమే..

చిదంబరప్ప, పెనకచెర్ల



ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా సాగునీరు, తాగునీరు ప్రాజెక్టుల పనులను ఆపడం సమంజసం కాదు. ఏళ్లు గడుస్తున్నా మిగిలిన 20శాతం ప్రాజెక్టు పనులు పూర్తి చేయలేకపోవడం పాలకుల వైఫల్యానికి నిదర్శనం. ప్రజాస్వామ్యంలో ప్రజలకు అత్యవసరమైన తాగునీటి ప్రాజెక్టును రాజకీయ కోణంలో పరిగణించడం సబబుకాదు. ప్రజలపై చిత్తశుద్ధి ఉంటే వెంటనే ప్రాజెక్టు పనులను పూర్తి చేసి ప్రజల మన్ననలు పొందాలి. తాగునీరు, సాగునీరుపై రాజకీయాలు చేయడం బాధాకరం. ఎన్నో గ్రామాల దాహార్తి తీర్చే ప్రాజెక్టు పూర్తి చేయడంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి

కాంట్రాక్టర్లు స్పందించలేదు..

గంగాధరం, డీఈ, ఆర్‌డబ్ల్యూఎస్, అనంతపురం

తాగునీటి ప్రాజెక్టు 2019 సంవత్సరానికి పూర్తి కావాల్సి ఉంది. ఎన్నికల సమయానికి ప్రాజెక్టు పనులు 80 శాతం పూర్తి అయ్యాయి. పనులు చేసేందుకు మిగిలిన 20శాతం పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. పనులు సకాలంలో జరిగి ఉంటే ఇప్పటికే ప్రాజెక్టు పూర్తయ్యేది. బిల్లులు కూడా కొంతవరకు పెండింగ్ ఉన్నాయి. ఇప్పటికే ప్రాజెక్టు గడువును రెండేళ్లు పెంచాము. బిల్లులు రాక కాంట్రాక్టర్లు స్పందించకపోవడంతో పనులు నిలిచిపోయాయి. పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు ఇప్పటికే నోటీసులు జారీ చేశాం.

కోడ్ ఉల్లంఘనలపై
కలెక్టర్ కొరడా

- 36 మంది వలంటీర్లపై వేటు
- ఇతరశాఖలకు చెందిన మరో 16మందిపైనా..



అనంతపురం టౌన్, మార్చి 26: ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై జిల్లా కలెక్టరు కొరడా ఝళిపిస్తున్నారు. మొదట్లో కొంత చూసీచూడనట్లు అధికారుల వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతూ వచ్చాయి. దీనిపై ఆంధ్రజ్యోతిలోనూ ప్రత్యేక కథనాలు ప్రచురించడం జరిగింది. అప్పటినుచి కలెక్టరు గౌతమి కోడ్ ఉల్లంఘనలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. రాజకీయ పార్టీల కార్యక్రమాలు. ప్రచారాల్లో పాల్గొంటున్న వలంటీర్లు. డీలర్లు, సచివాలయ సిబ్బంది. ఐకేపీ సిబ్బందిపై చర్యలు చేపడుతూ వస్తున్నారు. ఇందు కు సంమందించి మంగళవారం కలెక్టరు వివరాలు వెల్లడించారు. ఇప్పటి వరకు 36మంది వలంటీర్లపై చర్యలు తీసుకున్నట్లు కలెక్టరు తెలిపారు. మంగళవారం కూడా గుంతకల్ నియోజకవర్గంలో ఆరుగురు వలంటీర్లు. రాయదుర్గం నియోజకవర్గంలో 9మంది వలంటీర్లపై చర్యలు వేటు వేసినట్లు ఆమె వెల్లడించారు. వీరితో పాటు ఇతరశాఖలకు చెందిన మరో 16 మందిపైనా చర్యలు తీసుకున్నామనీ, ఇందులో డీలర్లు ఐదుగురు, కాంట్రాక్ట్ ఉద్యోగులు ఏడుగురు, రెగ్యులర్ ఉద్యోగి ఒకరిపై చర్యలు తీసుకున్నట్లు కలెక్టరు తెలిపారు. ఇందులో కూడా మంగళవారం ముగ్గురు కాంట్రాక్ట్ ఉద్యోగులపై వేటు వేసినట్లు తెలిపారు. ఎన్నికల నియమావళికి విరుద్ధంగా ఉన్న 7,025 పోస్టర్లు, 3,312 బ్యానర్లు, 812 గోడలపై రాతలు తొలగించామన్నారు. ఇప్పటివరకు సీవిజిల్ యాప్‌ద్వారా 191 ఫిర్యాదులు వచ్చాయనీ, పరిశీలించి చర్యలు తీసుకున్నామని కలెక్టరు గౌతమి తెలిపారు.

ఒకే మండలంలో 9మంది తొలగింపు..

బొమ్మనహాళ్: మండలంలోని దర్గాహోన్నూరు గ్రామ పంచాయతీ పరిధిలో తొమ్మిదిమంది వలంటీర్లను తొలగించినట్లు పంచాయతీ కార్యదర్శి కుళ్లాయినాయుడు మంగళవారం తెలిపారు. మెట్టు విశ్వనాథ్‌రెడ్డి నిర్వహించిన ఇంటింటి ప్రచారంలో వలంటీర్లు పాల్గొన్నారు. మంగళవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'వైసీపీ కోసం చట్టవిరుద్ధమైన ప్రచారం' శీర్షికతో ప్రచురితమైన వార్తపై స్పందించి వారిని తొలగించినట్లు తెలిపారు. సచివాలయం-1 పరిధిలో బడిగె వన్నూరుస్వామి, బంగి వన్నూరుస్వామి, శరణబసవ, హనుమంతు, భీమయ్య అలియాస్ అజయ్, వన్నేష్, సచివాలయం-2 పరిధిలో మోక నాగరాజు, అడివప్ప గారి ప్రసాద్, వాల్మీకి భాస్కర్‌లను తొలగించారు.

పుట్టపర్తిలో ముగ్గురు..

పుట్టపర్తి: వైసీపీకి మద్దతుగా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ముగ్గురు వలంటీర్లను విధుల నుంచి తొలగించారు. మండల పరిధిలోని కప్పలబండలో వలంటీర్లు రత్నమ్మ, సరోజమ్మలను తొలగించినట్లు ఎంపీడీఓ నాగేశ్వరరెడ్డి పేర్కొన్నారు. మూడోవార్డులో వలంటీరు రమణను మున్సిపల్ కమిషనర్ అంజయ్య విధుల నుంచి తొలగించారు.

ఇద్దరు ఎన్‌ఎంఆర్ ఉద్యోగుల సస్పెన్షన్

తాడిపత్రిటౌన్: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఎన్‌ఎంఆర్‌లు విధులు నిర్వహిస్తున్న జేసీ సూర్యనారాయణరెడ్డి, తిరుపాల్‌రెడ్డిలను మున్సిపల్ కమిషనర్ రాంమోహన్ మంగళవారం సస్పెండ్‌చేశారు. ఎన్నికల ప్రచారంలో ఎన్‌ఎంఆర్‌లు పాల్గొనడంపై సస్పెండ్ చేసినట్లు కమిషనర్ తెలిపారు.

ఇద్దరు వలంటీర్ల రాజీనామా

కదిరిఅర్బన్, మార్చి 26: కదిరి మండలంలోని యాకాల చెరువుపల్లి కి చెందిన ఇద్దరు వలంటీర్లు తాము విధులనుంచి తప్పుకుంటున్నట్లు రాజీనామాపత్రాలను ఎంపీడీఓ ఆంజప్పకు మంగళవారం అందించారు. వ్యక్తిగత కారణాల దృష్ట్యా రాజీనామా చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

ట్రాక్టర్ల స్కాం..!



- రైతుల నుంచి లీజుకు తీసుకుని అక్రమంగా విక్రయం
- పులివెందుల వాసి కీలకపాత్ర
- పోలీసులకు ఫిర్యాదు
- మూడు ట్రాక్టర్ల స్వాధీనం?

తాడిమర్రి, మార్చి 26: భారీస్థాయిలో ట్రాక్టర్ల స్కాం వెలుగుచూసింది. రైతుల నుంచి ట్రాక్టర్లను లీజుకు తీసుకెళ్లి, అక్రమంగా అమ్ముకుంటున్న బాగోతం వెలుగులోకి వచ్చింది. తాడిమర్రి మాజీ సర్పంచ్ భర్త రామ్మోహన్ ఫిర్యాదు మేరకు రెండ్రోజుల క్రితం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగస్వామి తెలిపారు. కేసులో ప్రధాన నిందితుడైన పులివెందులకు చెందిన భయారెడ్డి, నల్లచెరువు వాసి రవిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. తాడిమర్రి మండలంతోపాటు నల్లమాడ, తలుపుల, పుట్టపర్తి, గోరంట్ల, బత్తలపల్లి మండలాల రైతుల నుంచి ట్రాక్టర్లను లీజుకు తీసుకెళ్లి, వాటిని ఇతరులకు అమ్ముకున్నట్లుగా తెలిసింది. విశ్వసనీయ సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. పులివెందులకు చెందిన భయారెడ్డి.. తాడిమర్రి మండలంలో 11, అనంతపురం జిల్లా కణేకల్లులో దాదాపు 50, ఇతర మండలాల రైతుల నుంచి కూడా ట్రాక్టర్లను లీజుకు తీసుకున్నాడు. నెలకు రూ.24,900 లీజు చెల్లించేలా ఒప్పందం కుదుర్చుకున్నాడు. గతేడాది సెప్టెంబరు నుంచి ఈ వ్యవహారం మొదలు పెట్టాడు. ఇందుకోసం దళారులను కూడా ఏర్పాటు చేసుకుని, వారికి నెలకు రూ.5వేలు ఇచ్చేలా మాట్లాడుకున్నాడు. జనవరి వరకు అందరికీ లీజు మొత్తాలు, కమీషన్ ఇచ్చాడు. ఆ తరువాత ఫోన్లు స్విచాఫ్ చేసుకున్నారు. భయారెడ్డితోపాటు అతడు ఏర్పాటు చేసుకున్న మనుషులు పరారయ్యారు. తాడిమర్రి మాజీ సర్పంచ్‌తోపాటు మరో ఆరుగురు రైతులు కేవలం మండల కేంద్రం నుంచి 11 ట్రాక్టర్లు, శివంపల్లి నుంచి రెండు లీజుకు ఇచ్చారు. కొత్త ట్రాక్టర్లు మాత్రమే లీజుకు తీసుకుంటామని కండీషన్ కూడా పెట్టారు. తాడిమర్రి మాజీ సర్పంచ్ కొత్తగా మరో ట్రాక్టర్ తెచ్చి మరీ జనవరిలో లీజుకిచ్చాడు. ఆ తరువాత నెల లీజు కూడా తీసుకోకుండానే భయారెడ్డి పరారయ్యాడు. ఆరునెలలకోసారి ట్రాక్టర్ కంతు రూ.60వేలు చెల్లించాల్సి ఉంటుందనీ, ప్రతినెలా రూ.25వేలు లీజు మొత్తం వస్తే అందులో రూ.20వేలు కంతులకుపోను మిగిలిన మొత్తం మిగిలుతుందని రైతులు చెబుతున్నారు. లీజుకు తీసుకున్న వ్యక్తి ట్రాక్టర్లను తక్కువ ధరకే ఇతరులకు అమ్ముకున్నట్లు తెలిసింది. కొత్తగా ట్రాక్టర్‌ను కొనుగోలు చేయాలంటే రూ.8లక్షలు అవుతుంది. వడ్డీ, ఫైనాన్స్ ఖర్చులతో కలిపి రూ.10లక్షలదాకా అవుతోంది. ఈలెక్కన ఒక్కో రైతు రూ.లక్షల్లో మోసపోయారు. దీనిపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, దర్యాప్తు కొనసాగిస్తున్నారు. తాడిమర్రి ఎస్ఐ నాగస్వామి ఆధ్వర్యంలో ఆ బృందాలు గడిచిన రెండు రోజుల్లో నాలుగు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. లీజుకిచ్చిన తాడిమర్రి రైతులు తమ ట్రాక్టర్లు ఎక్కడున్నాయో తెలుసుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. ట్రాక్టర్లు కడప, ప్రకాశం, నెల్లూరు జిల్లాల వారికి అమ్ముకున్నట్లు తెలిసింది.

పోలీసుల అదుపులో హత్యకేసు అనుమానితులు

నల్లమాడ, మార్చి 26: టీడీపీ నాయకుడి హత్య కేసులో అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. మండలంలోని కుటాలపల్లికి చెందిన టీడీపీ నాయకుడు దుద్దుకుంట అమరనాథ్‌రెడ్డి సోమవారం హత్యకు గురైన సంఘటన తెలిసిందే. ఈ హత్యకేసులో అనుమానితులుగా ఉన్న ఓమహిళతో పాటు ముగ్గురు పురుషులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలుస్తోంది.

టీడీపీ మద్దతుదారుడిపై దాడి

తాడిపత్రిటౌన్, మార్చి26: పట్టణంలోని టైలర్స్‌కాలనీలో మంగళవారం టీడీపీ మద్దతుదారుడు మౌలాలిపై వైసీపీ మద్దతుదారుడు మసూద్‌వలి దాడిచేశాడని పట్టణ పోలీసులు తెలిపారు. మౌలాలి వైసీపీలో ఉన్నప్పుడు మసూద్‌వలితో స్నేహంగా ఉండేవాడు. పదిరోజుల నుంచి మౌలాలి టీడీపీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నాడు. ఈ విషయమై మౌలాలిని మసూద్‌వలి నిలదీశాడు. ఇద్దరి మధ్య మాటమాటపెరిగి ఘర్షణకు దారితీసింది. మౌలాలిపై మసూద్‌వలి దాడిచేశాడు. చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఇరువురిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

టెన్త్ పరీక్షకు 3,074 మంది గైర్హాజరు

అనంతపురం విద్య, మార్చి 26 : పదో తరగతి పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 3,074 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మంగళవారం 142 పరీక్షా కేంద్రాల్లో బయాలజీ పరీక్ష నిర్వహించారు. రెగ్యులర్ విద్యార్థులు 31,330 మందికిగాను 30,944 మంది హాజరు కాగా 386 మంది గైర్హాజరయ్యారు. 5,057 మంది ప్రైవేట్ విద్యార్థులకు గాను 2,369 మంది హాజరు కాగా 2,688 మంది గైర్హాజరయ్యారు. డీఈఓ వరలక్ష్మి రెండు పరీక్షా కేంద్రాలు, ఏసీ గోవింద్ నాయక్ రెండు పరీక్షాకేంద్రాలు, ఫ్లయింగ్ స్క్వాడ్ 27 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.

రూ. 2.20 లక్షల నగదు పట్టివేత

రాయదుర్గం రూరల్, మార్చి 26: పట్టణ సమీపంలోని గాలిమారమ్మ గుడి చెక్‌పోస్టు వద్ద గణాంక నిఘా బృందం అధికారులు వాహనాలు తనిఖీ చేస్తుండగా రూ. 2.20 లక్షలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు తహశీల్దార్ చిట్టిబాబు తెలిపారు. మంగళవారం చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీల్లో భాగంగా బస్సులు తనిఖీ చేయగా బెళుగుప్ప మండలం అంకంపల్లి గ్రామానికి చెందిన రైతు సాయికుమార్ రూ. 2.20 లక్షలు నగదును స్వాధీనం చేసి సీజ్ చేసినట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ ఉన్నందున ఈ నగదును అనంతపురం జిల్లా అధికారులకు చేరవేస్తున్నట్లు తెలిపారు.

రంగు పడింది..!

- ఆర్బీకేల కలర్ మార్పు ఖర్చు భారం ఏఓలపైనే..!
- ఎన్నికల కోడ్ అమలుతో తెలుపు కలర్ కవరింగ్ ..

అనంతపురం అర్బన్, మార్చి 26 : ఎన్నికల కోడ్ అమలైనా ఆర్బీకేలకు వైసీపీ రంగులు అలాగే ఉంచారంటూ ఆంధ్రజ్యోతిలో ప్రచురించిన కథనంపై జిల్లా వ్యవసాయ యంత్రాంగం స్పందించింది. రైతు భరోసా కేంద్రాలకు పార్టీ రంగుల స్థానంలో తెలుపు రంగు వేశారు. అయితే రంగు మార్పు ఖర్చులు ఆయా మండలాల వ్యవసాయ అధికారులపైనే వేయడం విమర్శలకు దారితీస్తోంది. జిల్లా వ్యాప్తంగా 451 రైతు భరోసా కేంద్రాలున్నాయి. వీటిలో 280 ఆర్బీకేలను అద్దె భవనాల నుంచి ప్రభుత్వ సొంత భవనాల్లోకి మార్చారు. అప్పట్లో ఒక్కో ఆర్బీకేకు రంగులు వేసేందుకు రూ.15వేల నుంచి రూ.20 వేలు ఖర్చు చేశారు. ఈ లెక్కన రూ.67.65 లక్షలకుపైగా ఖర్చు చేశారు. తాజాగా ఎన్నికల కోడ్ అమలుతో పార్టీ రంగుల స్థానంలో తెలుపు కలర్ వేశారు. ఇందు కోసం ఒక్కో ఆర్బీకేకు రూ.5వేల నుంచి రూ.10వేలు ఖర్చు అవుతోంది. ఆయా ఆర్బీలకు తెలుపు కలర్ వేసేందుకు స్థానిక వ్యవసాయ అధికారులే ఖర్చు పెట్టుకోవాలని ఉన్నతాధికారులు ఆదేశించినట్లు సమాచారం. దీంతో ఒక్కో అధికారికి రూ.50వేల నుంచి రూ.లక్ష దాకా భారం పడుతున్నట్లు సమాచారం. ప్రభుత్వం సొంత భవనాల్లో ఏర్పాటు చేసిన ఆర్బీకేలకు పార్టీ రంగులు వేయలేదు. అద్దె భవనాలన్నింటిలోనూ పార్టీ రంగులు వేశారు. ఆర్బీకేల్లో వైఎస్ఆర్ పేరును తొలగించారు. అద్దె భవనాలకు పార్టీ రంగులు వేయకుండా ఉంటే తమకు ఈ అవస్థలు వచ్చేవి కాదంటూ వ్యవసాయ అధికారులు నిట్టూరుస్తున్నారు.



కూడేరు మండలం మరుట్ల ఆర్బీకేకి తెలుపు రంగు వేసిన దృశ్యం



తిమ్మాపురం ఆర్బీకే భవనానికి వైఎస్ఆర్ పేరును తొలగించిన దృశ్యం

మైనార్టీలకు జగన్ తీరని ద్రోహం

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీశ్

గుంతకల్లు, మార్చి 26: ముస్లింలకు వైసీపీ అధినేత జగన్ తీరని ద్రోహం చేశాడని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీశ్ పేర్కొన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో మంగళవారం ఉదయం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీజేపీతో టీడీపీ ఎన్నికల పొత్తు పెట్టుకోవడం వల్ల మైనార్టీల హక్కులకు ప్రమాదం ఏర్పడుతుందని వైసీపీ నాయకులు సన్నాయి నొక్కులు నొక్కుతున్నారని, నిజానికి కొన్ని ముస్లిం వ్యతిరేక చట్టాలకు మద్దతిచ్చి మైనార్టీలకు వైసీపీ తీరని ద్రోహం చేసిందన్నారు. పౌరసత్వ సవరణ చట్టానికి (సీఏఏ) లోక్‌సభ, రాజ్యసభలో మద్దతు పలికింది వైసీపీ కాదా అని ప్రశ్నించారు. రాజ్యసభలో తగిన బలంలేని బీజేపీ జగన్ చలవతో సీఏఏ, తదితర చట్టాలను ఆమోదింపజేసుకుందన్నారు. బీజేపీ ముస్లింలకు వ్యతిరేకంగా తెచ్చిన ప్రతి చట్టం ఆమోదం వెనుక వైసీపీ హస్తం ఉందని వెల్లడించారు. మైనార్టీలను దేశంలో ద్వితీయ శ్రేణి పౌరులుగా మార్చివేశారన్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్మోహన్‌రెడ్డిని ఓడించేందుకు కృషి చేస్తామన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా నాయకుడు బీ గోవిందు, డివిజన్ కన్వీనరు వీరభద్రస్వామి, నాయకులు బీ మహేశ్, గోపి, మహమ్మద్ గౌస్ పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జగదీశ్

బెంచీకి ఇద్దరు..

- పది పరీక్షల్లో నిర్లక్ష్యం
- డీఈఓ తనిఖీలో బట్టబయలు

అనంతపురం విద్య/కూడేరు మార్చి 26: పదో తరగతి పరీక్షల్లో సిబ్బంది నిర్లక్ష్యం బట్టబయలైంది. నిబంధనలకు విరుద్ధంగా చిన్న బెంచీపై ఇద్దరు విద్యార్థులతో పరీక్షలు రాయించడం ఆశ్చర్యం కలిగించింది. జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న కూడేరు జడ్పీ హైస్కూల్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. మంగళవారం జిల్లా విద్యాశాఖాధికారి వరలక్ష్మి ఆకస్మిక తనిఖీలో ఎంఈఓ, ఇతర పరీక్షల సిబ్బంది నిర్వాహకం బట్టబయలైంది. అత్యంత విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు కూడేరు హైస్కూల్ 10వ తరగతి బయాలజీ పరీక్ష జరుగుతుండగా డీఈఓ ఆకస్మిక తనిఖీకి వెళ్లారు. పరీక్షలు జరుగుతుండగానే స్కూల్ సిబ్బంది ఒకరు గేటు తీసుకొని బయటకు టీ కోసం వెళ్లడాన్ని గమనించారు. డీఈఓ స్కూల్ దగ్గరకు వెళ్లగానే.. 'ఎవరు నువ్వు...? పరీక్షలు జరుగుతుండగా... ఎందుకు బయటకెళ్తున్నావు' అంటూ డీఈఓ వరలక్ష్మి ఆరాతీశారు. 'మేడం టీ కోసం బయటికెళ్తున్నా' అంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇవ్వడంతో డీఈఓ అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 11.30 గంటల వరకు కేవలం 3 గంటలు జరిగే పరీక్షా సమయంలో ఇలా సిబ్బందిని బయటకు పంపడం ఏంటంటూ మండిపడినట్లు తెలుస్తోంది. తర్వాత డీఈఓ పరీక్షా కేంద్రం గేటు వేయించి సెంటర్‌ను తనిఖీ చేశారు. అయితే పరీక్షా కేంద్రంలోని గదుల్లో చిన్న బెంచీలపై ఇద్దరేసి విద్యార్థులను కూర్చోబెట్టి పరీక్షలు రాయిస్తుండటం చూసి డీఈఓ విస్తుపోయారు. బెంచీకి ఒక్కరిని కూర్చోబెట్టి పరీక్షలు రాయించాల్సి ఉండగా... ఇద్దరిని కూర్చోబెట్టడం ఏంటని కూడేరు ఎంఈఓ చంద్రశేఖర్‌పై డీఈఓ మండిపడ్డారు. ఎంఈఓకు ఫోన్ చేసి తీవ్ర స్థాయిలో ఫైర్ అయినట్లు సమాచారం. ఎంఈఓ మండలంలో ప్రైవేట్ స్కూళ్లు తక్కువ ఉన్నాయని...? బెంచీల కొరత ఉందంటూ...తాను సర్దలేనంటూ... బుకాయించేలా సమాధానం చెప్పినట్లు సమాచారం. దీంతో డీఈఓ అనంతపురం, ఇతర మండలాల నుంచి ఎందుకు బెంచీలు సర్దుబాటు చేసుకోలేదని ప్రశ్నించినట్లు సమాచారం. ఎంఈఓ నిర్లక్ష్యంపై డీఈఓ జిల్లా పరీక్షల పరిశీలకులు, ఆర్‌జేడీ రాఘవరెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది.



కూడేరు జడ్పీ హైస్కూల్

ఇద్దరికి షోకాజ్ నోటీసులు

పదవ తరగతి పరీక్షల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన కూడేరు ఎంఈఓ చంద్రశేఖర్, సెకెండరీ గ్రేడ్ టీచర్ అడవిరాజుకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఏర్పాట్లపై శ్రద్ధ చూపనందుకు ఎంఈఓకు, పరీక్షా కేంద్రం నుంచి టీ కోసం స్టాఫ్‌ను బయటకు పంపడంపై అడవిరాజుకు షోకాజ్ నోటీసు జారీ చేశారు.

రేపు రాప్తాడుకు చంద్రబాబు రాక

ఏర్పాట్లను పరిశీలించిన పరిటాల సునీత, శ్రీరామ్



మాట్లాడుతున్న పరిటాల శ్రీరామ్, చిత్రంలో పరిటాల సునీత

రాప్తాడు, మార్చి 26: రాప్తాడులో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు గురువారం ప్రజాగళం సభ నిర్వహిస్తున్నారని, ఆ సభను విజయవంతం చేయాలని మాజీ మంత్రి పరిటాల సునీత, ధర్మవరం టీడీపీ నియోజక వర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ పిలుపునిచ్చారు. మంగళవారం ప్రజాగళం సభ ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం నగరంలోని క్యాంపు కార్యాలయంలో టీడీపీ నాయకులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు రాప్తాడు నియోజకవర్గంకు వస్తున్నారని, ఈ ప్రజాగళం కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. గురువారం ఉదయం 10 గంటలకు రాప్తాడు బస్టాండ్ వద్ద రోడ్ షో, బహిరంగ సభ ఉంటుందన్నారు. అన్ని మండలాల నుంచి జనం తరలివచ్చేలా నాయకులు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు ఎక్కడికి వెళ్లినా భారీగా జనాలు వస్తున్నారన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని రాష్ట్ర ప్రజలందరూ కోరుకుంటున్నారన్నారు. అన్ని ప్రాంతాల కంటే రాప్తాడులో అత్యధికంగా జనాలు తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గటీడీపీ నాయకులు పాల్గొన్నారు.

జగన్‌ను ఓడించేందుకు లక్ష కారణాలున్నాయ్..

అనంతపురం అర్బన్ : సీఎం జగన్‌ను ప్రజలు ఓడించేందుకు లక్ష కారణాలున్నాయని మాజీ మంత్రి పరిటాల సునీత పేర్కొన్నారు. మంగళవారం అనంతపురం నగరంలోని ఆమె నివాసంలో మీడియాతో మాట్లాడుతూ.... జగన్ ఐదేళ్ల పాలనలో ఏ వర్గానికీ మంచి చేయలేదన్నారు. జగన్ ఇచ్చిన హామీల్లో 85 శాతం నెరవేర్చలే దన్నారు. ప్రతి సభలోనూ 99 శాతం హామీలు నెరవేర్చానంటూ అబద్దాలు చెబు తూ ప్రజలను మరో సారి మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. మద్య పాన నిషేధం చేస్తామన్న మాట తప్పడంతో పాటు అదే మద్యాన్ని ఆదాయ వనరుగా మార్చుకొని నాసిరకం మద్యాన్ని విక్రయించి లక్షలాది మంది ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తొమ్మిది సార్లు కరెంటు చార్జీలు పెంచి, ప్రజలపై రూ.64 వేల కోట్ల భారం మోపారన్నారు. మెగా డీఎస్సీ అంటూ ఎన్నికల సమయంలో దగా డీఎస్సీని విడుదల చేసి యువతను మోసం చేశాడన్నారు. రాష్ట్రం లోని అన్ని ప్రాంతాల్లో ఇసుక దోపిడీకి పాల్పడుతూ సామాన్య ప్రజలకు ఇసుక లేకుండా చేశారన్నారు. ఇలా చెప్పుకుం టూపోతే అన్ని వర్గాల ప్రజలకు జగన్ చేసిన మోసాలు చాలా ఉన్నాయన్నారు. ఐదేళ్లల్లో రూ.8 లక్షల కోట్లకుపైగా అక్రమా ర్జన చేశాడని, అలాంటి జగన్‌ను ఇంటికి సాగనంపేందుకు అన్ని వర్గాల ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఈకార్యక్ర మంలో రాప్తాడు మండలం టీడీపీ కన్వీనర్ కురబ కొండప్ప, బోయ జయరాములు పాల్గొన్నారు.

అప్పులబాధతో వ్యవసాయ కూలీ ఆత్మహత్య

రామగిరి, మార్చి 26: స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన నారాయణ (57) అప్పుల బాధ తాళలేక ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వ్యవసాయ కూలీ అయిన అతనికి కొన్ని ఏళ్ల క్రితం జరిగిన ప్రమాదంలో కాలు విరిగింది. దీంతో అతను వ్యవసాయ పనులకు వెళ్లేవాడు కాదు. అప్పులు అధికమయ్యాయి. దీంతో మనోవేధనకు గురైన అతను స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో ఉన్న చెట్టుకు సోమవారం రాత్రి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం ఉదయం అతను చనిపోయి ఉండటాన్ని గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించామని, కేసు దర్యాప్తులో ఉందని ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. నారాయణకు భార్య పార్వతమ్మ, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.


వెంకటాపురంలో వృద్ధుడు...

బుక్కరాయసముద్రం : మండలంలోని వెంకటాపురం గ్రామంలో షేక్ అహమ్మద్ బాషా (74)ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయన కొన్ని సంవత్సరాలుగా మద్యానికి బానిస అయ్యాడు. మంగళవారం వేకువ జామున మూడు గంటల సమయంలో కుటుంబ సభ్యులతో గొడవ పడి ఇంట్లో ఉన్న క్రిమిసంహారక మందు తాగాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు అతన్ని వెంటనే అనంతపురం సర్వజన ఆస్పత్రికి తరలించారు. కోలుకోలేక అతను మరణించాడు. కేసు దర్యాప్తులో ఉందని బుక్కరాయసముద్రం పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

నార్పల: మండలంలోని మద్దలపల్లి గ్రామం వద్ద సోమవారం రాత్రి ప్రమాదవశాత్తు పది అడుగుల గుంతలో బైక్‌తో సహా పడి ఓ వ్యక్తి అక్కడిక్కడే మరణించాడు. పెద్దవడుగూరు మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన నీలకంఠరెడ్డి (55), సమీప బంధువు లక్ష్మీదేవి ఇద్దరు ద్విచక్రవాహనంపై సోమవారం అనంతపురానికి వెళ్లారు. రాత్రి తిరిగి స్వగ్రామానికి వస్తూ.. మార్గమధ్యలో మద్దలపల్లి హైవేలో రోడ్డు నిర్మాణం కోసం తీసిన పది అడుగుల గుంతలో బైక్‌తో సహా పడ్డారు. నీలకంఠరెడ్డి అక్కడిక్కడే మరణించాడు. లక్ష్మీదేవి తీవ్రంగా గాయపడింది. గమనించిన స్థానికులు ఆమెను జేసీబీతో గుంతలో నుంచి బయటకు తీశారు. ఆమెను అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నీలకంఠరెడ్డికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.

సపోటా చెట్లకు నిప్పు



తోటలో చెలరేగిన మంటలు

నార్పల, మార్చి 26: మండలంలోని కురగానపల్లి గ్రామంలో పద్మనాభరెడ్డికి చెందిన సపోటా చెట్లకు మంగళవారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో అవి దగ్ధమయ్యాయి. పద్మనాభరెడ్డి ఇప్పటిలాగే తన సపోటా తోటకి వెళ్లి పనులు ముగించుకుని ఇంటికి వచ్చాడు. ఇంతలోగా గుర్తుతెలియని వ్యక్తులు సపోటా చెట్లకు నిప్పుపెట్టడంతో మూడు ఎకరాల్లో సాగు చేసిన సపోటా చెట్లు, డ్రిప్ పైపులు దగ్ధమయ్యాయి. సుమారు రూ. ఆరు లక్షలు నష్టం వాటిల్లిందని పద్మనాభరెడ్డి వాపోయాడు.

టీవీ రిపేరీ దుకాణంలో అగ్నిప్రమాదం



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

అనంతపురం న్యూటౌన్, మార్చి 26: స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న టీవీల రిపేరీ దుకాణం బాలాజీ ఎలక్ట్రానిక్స్‌లో మంగళవారం అగ్నిప్రమాదం జరిగింది. వెంటనే అగ్నిమాపక శాఖ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో ఆ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలు చుట్టుపక్కల దుకాణాలను వ్యాపించకుండా అదుపు చేశారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పినట్లు అయింది. కాగా, దుకాణంలో రూ.2 లక్షల వరకు ఆస్తి నష్టం ఉంటుందని జిల్లా అసిస్టెంట్ అగ్నిమాపక శాఖాధికారి లింగమయ్య తెలిపారు. షార్ట్ సర్క్యూట్ వల్లే ఈ అగ్నిప్రమాదం చోటు చేసుకుందని షాపు యజమాని శేషఫణి తెలిపారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ సిబ్బంది క్రిష్ణకుమార్, రాఘవేంద్ర, రమేష్, శివతేజ, పీఎస్ నాయుడు పాల్గొన్నారు.

బెల్ట్ షాప్ నిర్వాహకుడి అరెస్టు

గార్లదిన్నె మార్చి 26: బెల్ట్ షాప్ నిర్వాహకుడు, శింగనమల మండలం ఆకులేడు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మంగళవారం సాయంత్రం అదుపులోకి తీసుకున్నట్లు గార్లదిన్నె ఎస్ఐ గౌస్‌బాషా తెలిపారు. ఆ వ్యక్తి గార్లదిన్నె ప్రభుత్వ మద్యం షాపులో 14 మద్యం బాటిళ్లను కొనుగోలు చేసి స్వగ్రామానికి తీసుకెళ్తుండగా అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

బాధితుడికి ఆర్థికసాయం



షెక్షావలికి ఆర్థికసాయం అందజేస్తున్న రమేష్, నాయకులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి26: స్థానిక ప్రజాశక్తి నగర్, బీజేపీ కొట్టాలలో ఇటీవల ఇళ్లకు కరెంటు సరఫరా కావడంతో... పెయింటర్ షెక్షావలి విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డ విషయం తెల్సిందే. అతని చేయి పనిచేయకపోవడంతో ఇంటిపట్టునే ఉంటున్నాడు. ఆర్థిక ఇబ్బందులు పడుతున్న అతనికి ఆర్టీసీ మాజీ గౌరవాధ్యక్షుడు, రాయలసీమ బలిజ మహాసంఘం యువజన అధ్యక్షుడు తొండపునాటి రమేష్ మంగళవారం రూ. 10 వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు.

టీడీపీ కార్యకర్త కుటుంబానికి..

నార్పల: మండలంలోని బండ్లపల్లిలో టీడీపీ సీనియర్ కార్యకర్త తలారి ఓబుళప్ప అనారోగ్యంతో ఇటీవల మరణించాడు. టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ద్విసభ్య కమిటీ సభ్యుడు ఆలం నరసానాయుడు బాధిత కుటుంబానికి రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు.

చంద్రబాబు పర్యటనలో స్వల్ప మార్పు



బీకేఎస్‌లో రోడ్డుషో కూడలిని పరిశీలిస్తున్న బండారు శ్రావణిశ్రీ

బుక్కరాయసముద్రం, మార్చి 26: బుక్కరాయసముద్రంలో గురువారం చంద్రబాబు పర్యటనలో స్వల్ప మార్పులు చేశామని, ప్రజాగళం సభావేదిక స్థలాన్ని మార్చామని టీడీపీ అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ, ద్విసభ్యకమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి తెలిపారు. చంద్రబాబు పర్యటన ఏర్పాట్లను మంగళవారం పరిశీలించిన వారు మాట్లాడారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట తాడిపత్రి రహదారిలోనే రోడ్డుషోతో పాటు అక్కడే ప్రజాగళం బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటలకు రోడ్డుషోతో పాటు సభ ఉంటుందన్నారు. కాగా, మొదట రోడ్డుషో అనుమతికి పోలీసులు నిరాకరించారు. అనంతపురం టీడీపీ నేతలు ఎస్పీ అన్బురాజన్, రూరల్ డీఎస్పీ శివారెడ్డిని కలిశారు. రోడ్డుషోకు అనుమతితో పాటు పోలీసు బందోబస్తు ఇవ్వాలని వారు విజ్ఞప్తి చేశారు. అందుకు ఎస్పీ, డీఎస్పీ సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ప్రజాగళం ప్రోగ్రాం రాష్ట్ర కో-ఆర్డినేటర్స్ రాజశేఖర్‌బాబు, రవియాదవ్, నియోజకవర్గం పార్టీ పరిశీలకుడు గుర్రప్ప చౌదరి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి, జిల్లా టీడీపీ ఉపాధ్యాక్షులు పసుపుల హనుమంతురెడ్డి, జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి పర్వతనేని శ్రీధర్‌బాబు, దేగల కృష్ణమూర్తి, జనసేన నియోజకవర్గం అధ్యక్షుడు సాకే మురళి కృష్ణ, టీడీపీ నేతలు కన్వీనర్ అశోక్, లక్ష్మినారాయణ, ఎస్‌నారాయణస్వామి, ఎస్‌కే వెంకటేశులు, చిదానందానాయుడు, జీసీబాబు, చితంబరదొర, దాసరిగంగాధర్, ఓబులపతి, జొన్నారామయ్య, కుళ్లాయప్ప , పెద్దన్న పాల్గొన్నారు.

ప్రజాగళాన్ని విజయవంతం చేద్దాం

రామగిరి, మార్చి 26: రాప్తాడులో గురువారం నిర్వహించే ప్రజాగళంసభను విజయవంతం చేద్దామని టీడీపీ నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కుంటిమద్ది రంగయ్య, మండల కన్వీనర్ సుధాకర్, ప్రధాన కార్యదర్శి మారుతీ ప్రసాద్, రామ్మూర్తి నాయుడు, పరందామ యాదవ్, శివకుమార్, శ్రీదర్‌నాయుడు, మాదాపురం శంకర మాట్లాడారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఈ సభలో తెలుగుదేశం పార్టీ మ్యానిఫెస్టో, బీసీ డిక్లరేషన్, రాష్ట్రంలో జరుగుతున్న దౌర్జన్యాలు, అక్రమాలు , ఎన్నికల్లో తెలుసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర వాటిపై దిశానిర్దేశం చేస్తారన్నారు. ఈ కార్యక్రమానికి టీడీపీ నాయకులు, అభిమానులు అందరు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ధర్మవరంరూరల్ : టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు గురువారం రాప్తాడులో నిర్వహించే ప్రజాగళం కార్యక్రమానికి అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి నెట్టెం వెంకటేష్, మండల కన్వీనర్ యాతంపోతలయ్య పేర్కొన్నారు. మంగళవారం కనగానపల్లిలోని టీడీపీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బిల్లేభాస్కర్, తెలుగుయువత బట్టాసురేష్‌చౌదరి, చల్లాబాలకృష్ణ, మాదినేని సుధాకర్, పూజారినాగభూషణం, కసుమూర్తి వెంకటేష్ పాల్గొన్నారు.



రామగిరిలో సమావేశమైన టీడీపీ నాయకులు

వైసీపీ అసమ్మతి సమావేశానికి అడుగడుగునా అడ్డంకులు

సమావేశం నిర్వహిస్తే బల్లా కన్వెన్షన్ హాల్ సీజ్ చేస్తాం : పోలీసుల హెచ్చరిక



వైసీపీ అసమ్మతి నేతల వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

బుక్కరాయసముద్రం, మార్చి 26: శింగనమల వైసీపీ అసమ్మతి నేతలు రాజకీయ సమావేశానికి పోలీసులు అడుగు అడుగునా అడ్డంకులు సృష్టించారు. వైసీపీ నేత ఆలూరు సాంబశివారెడ్డి ఒత్తిడి మేరకే పోలీసులు ఇలా అడ్డంకులు సృష్టించారని వైసీపీ నేతలు ఆరోపిస్తున్నారు. అనంతపురం పట్టణ పరిధిలోని గుత్తిరోడ్డు వద్ద ఉన్న బల్లా కన్వెన్షన్ హాల్ మంగళవారం శింగనమల నియోజకవర్గం అసమ్మతి రాజకీయ సమావేశానికి శ్రీకారం చుట్టారు. అయితే అనంతపురం రూరల్ డీఎస్పీ శివారెడ్డి, త్రీటౌన్ పోలీసులు ఉదయాన్నే బల్లా ఫంక్షన్ హాల్ వద్దకు చేరుకున్నారు. ఈ సమావేశానికి ఎలాంటి అనుమతీ లేదని ఫంక్షన్ హాల్ యాజమాని బల్లా సురేష్‌కు ఫోన్ చేసి హెచ్చరించారు. సమావేశానికి అనుమతి ఇస్తే... ఫంక్షన్ హాల్ సీజ్ చేస్తామని, కేసు నమోదు చేస్తామని హెచ్చరించినట్లు సమాచారం. దీంతో అసమ్మతి నేతల సమావేశం కాస్తా... అనంతపురం నుంచి నియోజకవర్గం వైసీపీ అభ్యర్థి సొంత గ్రామమైన సీపురం పెద్దమ్మ గుడి వద్దకు మార్చారు. దీంతో పాటు అసమ్మతి నేతల తలపెట్టిన ఆ సమావేశానికి నాయకులు, కార్యకర్తలు రాకుండా నార్పల, శింగనమల, పుట్లూరు, యల్లనూరు, బుక్కరాయసముద్రం మండలాల్లో పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. అయితే పోలీసుల కన్నుకప్పి సీ పురం గ్రామానికి వెళ్లారు.

ఘనంగా నారసింహుడి ఉత్సవాలు





స్వామివారి పంజు సేవకు తరలివచ్చిన భక్తులు, అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి (ఇన్‌సెట్లో)

చెన్నేకొత్తపల్లి, మార్చి 26: మండలంలోని న్యామద్దల ఎస్సీ కాలనీలో లక్ష్మీనరసింహస్వామి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. కదిరి పౌర్ణమిని పురస్కరించుకుని రెండు రోజులు పాటు నిర్వహించే ఈ ఉత్సవాలు మంగళవారంతో ముగిశాయి. గ్రామ సమీపంలోని కొండ నుంచి స్వామివారిని మంగళవారం ఉదయం ఆలయంలోకి ఊరేగింపుగా తీసుకువచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారి పంజు సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు భారీగా తరలివచ్చి తిలకించారు. ఆలయ ఆవరణంలో పెద్ద ఎత్తున దానంగం నిర్వహించారు. స్థానికులే కాకుండా చుట్టు ప్రక్కల గ్రామస్థులతో పాటు బెంగుళూరు నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

గ్రామాల్లో టీడీపీ విస్తృత ప్రచారం



పిల్లిగుండ్ల కాలనీలో..



పాపంపేటలో..

ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్: పలు గ్రామాల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం విస్తృత ప్రచారం చేశారు. అనంతపురం రూరల్ మండలంలోని పిల్లిగుండ్ల కాలనీ, పాపంపేటలో, గార్లదిన్నె మండలం మర్తాడు గ్రామంలో టీడీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు ఆవుల క్రిష్ణయ్య, బీసీసెల్ జిల్లా అధికార ప్రతినిధి గోసుల సుబ్బయ్య ఆధ్వర్యంలో, చెన్నేకొత్తపల్లి మండలం మేడాపురంలో మండల కన్వీనర్ ముత్యాల్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులు ప్రచారం నిర్వహించాయి.



మర్తాడులో...



మేడాపురంలో..

విద్యార్థులు సమాజ సేవను అలవర్చుకోవాలి

అనంతపురం సెంట్రల్, మార్చి 26: విద్యార్థులు విద్యతో పాటు సమాజ సేవనూ అలవర్చుకోవాలని ఎస్కేయూ వీసీ హుస్సేన్‌రెడ్డి సూచించారు.తెలుగు శాఖ ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్-1 ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరం ముగింపు సభను మంగళవారం నిర్వహించారు. ఇందులో వీసీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఆరు రోజులపాటు ప్రత్యేక శిబిరాలను నిర్వహించి పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత ఆరోగ్యంపై శ్రద్ధ ఉచిత వైద్యసేలు అందించడం అభినందనీయమన్నారు. కొవిడ్ మహమ్మారి విజృంభన సమయంలో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు ప్రాణాలకు తెగించి.. సేవలందించారని కొనియాడారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృష్ణకుమారి, ప్రోగ్రాం ఆఫీసర్ మురళీధరరావు, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ సదాశివరెడ్డి, అధ్యాపకులు నాసీల నాగేంద్ర, అనితమ్మ, రాముడు, రాజేశ్వరి, శకుంతల, సాల్మాన్‌రాజు, నారాయణ, శివానంద, సుధాకర్, జగదీష్ పాల్గొన్నారు.



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న వీసీ

పీఆర్ డీఈఈ స్వచ్ఛంద ఉద్యోగ విరమణ



అనంతపురం సిటీ, మార్చి 26: ఉమ్మడి జిల్లా పంచాయతీ రాజ్‌శాఖ పరిధిలోని శింగనమల, అనంతపురం (పీఆర్ఐ) డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ (డీఈఈ) రాచంరెడ్డి భాస్కర్‌రెడ్డి ఈనెల 31న స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేయనున్నారు. వాస్తవానికి వచ్చే ఆగస్టులో ఈయన ఉద్యోగ విరమణ చేయాల్సి ఉంది. ఆయన స్థానంలో అదే శాఖలోని పీఐయూ విభాగంలో పనిచేస్తున్న ఏఈఈ పాండురంగారెడ్డికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించే అవకాశం ఉంది. ఆ శాఖ ఇంజనీర్ల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడిగా భాస్కర్‌రెడ్డి ప్రత్యేక గుర్తింపు పొందారు.

ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణం

చెన్నేకొత్తపల్లి, మార్చి 26: స్థానికంగా గ్రామ సచివాలయం పక్కన ప్రభుత్వ స్థలంలో అక్రమంగా ఇంటి నిర్మాణ పనులు చేపట్టారంటూ స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో వీఆర్ఓ తులసమ్మ, పంచాయతీ కార్యదర్శి శ్యామల మంగళవారం ఆ స్థలాన్ని పరిశీలించారు. ఆ స్థలానికి సంబంధించి ఏ ఆధారాలు ఉన్నాయో చూపించాలని నిర్మాణ పనులు చేపట్టిన అశ్వర్థమ్మను అధికారులు ప్రశ్నించారు. అంతవరకు నిర్మాణ పనులు నిలిపివేయాలని వారు ఆమెకు సూచించారు.

ఇంటర్నేషనల్ చెస్ టోర్నీకి రఘు సైనిక్ స్కూల్ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్నడైరెక్టర్లు

అనంతపురం విద్య, మార్చి 26: ఇంటర్నేషనల్ చెస్ పోటీలకు రఘు సైనిక్ స్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు స్కూల్ డైరెక్టర్లు రాఘవేంద్ర, గురుప్రసాద్, లోకేష్ పేర్కొన్నారు. విద్యార్థులను వారు మంగళవారం ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా డైరెక్టర్లు మాట్లాడుతూ... నగరంలోని కనకదాసు కళ్యాణమండపంలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఓపెన్ ర్యాపిడ్ చెస్ టోర్నమెంట్-2024 పోటీలు ఏ1 చెస్ అకాడమీ, ఆల్ అనంతపూర్ చెస్ అసోసియేషన్, ఆంధ్రా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్నాయన్నారు. ఈ పోటీల్లో తమ స్కూల్ విద్యార్థులు ప్రతిభ సాధించారని, వచ్చే నెల 9న భీమవరంలో జరిగే ఇంటర్నేషనల్ ఫిడే ఓపెన్ రేటింగ్ చెస్ టోర్నమెంట్‌కు ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఓపెన్ కేటగిరీలో 5వ స్థానాన్ని అజయ్ దక్కించుకోగా, అండర్ 15 బాయ్స్ విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను సాయిచరణ్, శ్రావణ్ లతిత్ యాదవ్ దక్కించుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ ఆర్బిటర్ ఉదయ్ కుమార్ నాయుడు, సీనియర్ చెస్ కోచ్ మెహరాజ్, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజకీయ ప్రకటనలకు అనుమతి తప్పనిసరి

అనంతపురం రూరల్, మార్చి 26: రాజకీయ ప్రకటనలకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని అనంతపురం అర్బన్ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి గ్రంధి వెంకటేష్ సూచించారు. మంగళవారం నగరంలోని థియేటర్లు, ప్రింటింగ్ ప్రెస్ యజమానులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. థియేటర్లలో రాజకీయ ప్రకటనల ప్రదర్శనకు ముందుగా అనుమతులు తీసుకోవాలన్నారు. రాజకీయ కరపత్రాల గురించి ముందుగా డిక్లరేషన్‌తో పాటు కరపత్రాల సంఖ్య వారి వివరాలు తెలిజేయాలన్నారు. లేనిపక్షంలో ఎన్నికల నియమాలు ప్రకారం చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఈఆర్ఓ శివరామిరెడ్డి, థియేటర్ యజమానులు, ప్రింటింగ్ ప్రెస్ యాజమానులు పాల్గొన్నారు.

ఆర్డీటీ సేవలను అడ్డుకోవడం దుర్మార్గం



మాంచో ఫెర్రర్‌కు స్వారోస్ లక్ష్యాల ప్రతిమను అందజేస్తున్న నారాయణప్ప

అనంతపురం సెంట్రల్, మార్చి 26: అంతర్జాతీయ సహాయ, సహకారాలతో జిల్లాలోని నిరుపేదలకు విద్య, వైద్య, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న ఆర్డీటీ సంస్థ సేవలను కేంద్ర ప్రభుత్వం అడ్డుకునేలా అడుగులు వేయడం దుర్మార్గమని బహుజన లాయర్స్ ఫోరమ్ రాష్ట్ర అధ్యక్షుడు నారాయ ణప్ప పేర్కొన్నారు. మంగళవారం నారాయణప్ప ఆర్డీటీ సంస్థ అధినేత మాంఛూ ఫెర్రర్‌ను కలిశారు. నాలుగు దశాబ్దాలుగా గ్రామీణ ఎస్సీ, ఎస్టీ సామాజిక ప్రజలకు ఆర్డీటీ తన నిరంతర సేవలందిం చిందన్నారు. విదేశాల్లోని దాతలిచ్చే నిధులతో ఆర్డీటీ ఈ సేవలు అందిస్తోందని, ఈ ఆర్థిక సంవత్సరం ఆ లావాదేవీల ప్రక్రియను కేంద్ర ప్రభుత్వం రెన్యువల్ చేయలేదని అన్నారు. దీంతో ఆర్డీటీ సంస్థ సేవలను అడ్డుకునేలా చర్యలు తీసుకోవడం పేదల అభివృద్ధిని అణగదొక్కడమేనన్నారు. అనంతరం స్వేరో లక్ష్యాలతో కూడిన ప్రతిమను మాంఛోకు అందజేశారు.

ఏపీజీబీ శాఖ భవనం మార్పు

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 26: స్థానిక గుత్తిరోడ్డులోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు పాతూరు శాఖను వేణుగోపాల్ నగర్‌లోని నూతన భవనంలోకి మార్చారు. ఆ బ్యాంకు చైర్మన్ రాకేష్ కశ్యప్ మంగళవారం దాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఏడాది పొడవునా రైతుల పంట రుణాలు, అన్ని వర్గాలకు రుణాలు ఇచ్చేందుకు కృషి చేస్తామన్నారు. నూతనంగా ఏర్పాటు చేసిన సరళ రుణ కేంద్రాల ద్వారా త్వరిత గతిన అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ఆర్ఎం శ్రీదేవి, మేనేజర్ రెడ్డప్ప, సీనియర్ మేనేజర్లు పాల్గొన్నారు.

నేడు టీడీపీ నాయకుల సమావేశం

అనంతపురం అర్బన్, మార్చి 26: అనంతపురం అర్బన్ నియోజకవర్గం పరిధిలోని టీడీపీ నాయకులు, కార్యకర్తల సమావేశాన్ని బుధవారం నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు అనంతపురం నగరంలోని రాయల్ ఫంక్షన్ హాల్‌లో జరిగే సమావేశానికి టీడీపీ కుటుంబ సభ్యులు, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జిలతోపాటు రాష్ట్ర కార్యదర్శులు, వివిధ సాధికార కమిటీ నాయకులు, డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు, మాజీ కార్పొరేటర్లు, వివిధ అనుబంధ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు, సమన్వయ కర్తలు, బూత్ ఇన్‌చార్జిలు తప్పకుండా హాజరుకావాలని కోరారు.

చీనీకాయలు టన్ను రూ.25 వేలు

అనంతపురం రూరల్, మార్చి 26: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.25 వేలు, కనిష్ఠంగా రూ.10 వేలు, సరాసరి రూ.16 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 460 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

ఎన్నికల నియమావళి తప్పక పాటించాలి

అనంతపురం అర్బన్ : ఎరువుల దుకాణాల్లో ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలని అనంతపురం ఏడీఏ రవి ఆదేశించారు. మంగళవారం స్థానిక అనంతపురం ఏడీఏ కార్యాలయంలో ఏఓలు, ఎరువుల డీలర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాప్రతినిధుల పేర్లు, పార్టీ గుర్తులు కలిగిన అన్ని రకాల హోర్డింగ్‌లు తీసివేయాలన్నారు. ఎరువుల బస్తాలపై ప్రజాప్రతినిధుల ఫోటోలు ముద్రించి ఉంటే అవి కనిపించకుండా పెయింటింగ్ వేసి రైతులకు పంపిణీ చేయాలన్నారు. ఎవరైనా ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే తగు చర్యలు తప్పవన్నారు.

ఎప్పటికప్పుడు నివేదికలు అందించాలి: ఆర్వో

ఉరవకొండ, మార్చి 26: కంట్రోల్ రూం నుంచి ఎప్పటికప్పుడు నివేదికలు పంపాలని ఆర్వో, జేసీ కేతన్‌గార్గ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. పట్టణంలోని జూనియర్ కళాశాలలోని కంట్రోల్ రూంను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం తహసీల్దారు కార్యాలయంలో రాజకీయపార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు సమావేశాలు, ర్యాలీలు ప్రచారానికి సంబంధించి అనుమతులు తీసుకోవాలన్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి రూ.5.82లక్షల నగదు, 31 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు, 179మందిని బైండోవర్ చేశామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఈ ఆర్వో శిరీష, తహసీల్దారు శ్రీనివాసులు పాల్గొన్నారు.



కంట్రోల్ రూంలో అధికారులతో మాట్లాడుతున్న ఆర్వో, జేసీ కేతన్‌గార్గ్

ఓటరు నమోదుకు మరో అవకాశం: ఆర్డీవో

కళ్యాణదుర్గంరూరల్, మార్చి 26: పద్దెనిమిది సంవత్సరాలు వయసు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని ఆర్డీవో రాణి సుస్మిత సూచించారు. స్థానిక రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఫారం-6ను ఏప్రిల్ 1, 2024 వరకు స్వీకరిస్తామన్నారు. ఎన్నికల కమిషన్ 85 సంవత్సరాలు పైబడిన పీడబ్ల్యూడీ వారికి ఇంటి దగ్గరే ఓటు వేసే సదుపాయాన్ని కల్పించిందని తెలిపారు. అందుకోసం విస్తృతంగా అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అన్ని పోలింగ్ కేంద్రాలలో మౌలిక వసతులు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశులు, తహసీల్దారు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక

రాయదుర్గం, మార్చి 26: కణేకల్లు మండలంలోని బిదురకొంతం గ్రామానికి చెందిన 15 వైసీపీ కుటుంబాలు మంగళవారం టీడీపీలోకి చేరాయి. టీడీపీ అభ్యర్థి కాలవ శ్రీనివాసులు తన నివాసంలో వారికి కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీ సీనియర్ నాయకులు నాగన్నగౌడ్ ఆధ్వర్యంలో వీరందరూ పార్టీలోకి చేరారు. పార్టీలో చేరినవారిలో మోహన్, వన్నూరుస్వామి, మధు, చిన్న వన్నూరుస్వామి, ఉపేంద్ర, వెంకటేశులు, రాజు, సందీప్, రాజు, సన్నప్పయ్య, ఈశ్వర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



పార్టీలో చేరిన వారితో కాలవ శ్రీనివాసులు

టీడీపీ కార్యకర్త మృతికి నివాళి

గుమ్మఘట్ట: మండలంలోని బేలోడు గ్రామంలో టీడీపీ కార్యకర్త మడక ఆంజనేయులు(65) మంగళవారం మృతి చెందారు. మృతుడి కుటుంబాన్ని సాయంత్రం మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు పరామర్శించారు. ఈ సందర్భంగా మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. ఆర్థిక సాయం అందించారు. కాలవ సన్నన్న, కేపీ దొడ్డి నాగరాజు, బేలోడు సంజీవ, భోజరాజు, వజ్రవన్నూరు సర్పంచ్ అశోక్, గంగం అశోక్ పాల్గొన్నారు.

తలకిందుల తపస్సు చేసినా మెట్టు గెలవడు

రాయదుర్గం, మార్చి 26: వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి తలకిందుల తపస్సు చేసినా గెలవడని మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి జోస్యం చెప్పారు. పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌కు ఎన్నికల సందర్భంగా తన వద్ద ఉన్న తుపాకిని అప్పగించేందుకు ఆయన మంగళవారం విచ్చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో ప్రతి గడపకు తిరిగాననీ, వైసీపీకి తన నుంచే ఇక్కడ పునాది పడిందని స్పష్టం చేశారు. ఇప్పుడు రామచంద్రారెడ్డి లేని వైసీపీ చాలా విలవిల్లాడా ఉందన్నారు. 2009 ఎన్నికల్లో ఒక్క ఓటుతోనైనా గెలుస్తానని చెప్పి 15 వేల ఓట్లతో మెట్టు ఓడిపోయిన విషయాన్ని గుర్తు చేశారు. ఇప్పుడు కూడా ఒక్క ఓటుతో గెలుస్తానని చెబుతున్న ఆయన 30 వేల నుంచి 50 వేల ఓట్ల తేడాతో ఓడిపోవడం తథ్యమన్నారు. రాజకీయ వ్యభిచారం చేసి సమర్థుడని చెప్పుకోవడం కంటే నీచంలేదన్నారు. ఏపీఐఐసీ చైర్మన్ పదవి తీసుకున్న నువ్వు ఆ పదవిలో ఉండి రాయదుర్గానికి ఏమి చేశావో చెప్పాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న 'కాపు'

రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం

యాడికి, మార్చి 26: రాష్ట్రాభివృద్ధి టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జేసీ అశ్మిత్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని రాయలచెరువులో ఆయన విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సమస్యలపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి చెందాలంటే టీడీపీ అధికారంలోకి రావాల్సిందేనన్నారు. కార్యక్రమంలో కదిరి శ్రీకాంత్‌రెడ్డి, వేలూరు రంగయ్య, పరిమి చరణ్, నాయకులు నాగముని‌రెడ్డి, శ్యాంసుందర్‌నాయుడు, కులశేఖర్‌నాయుడు, శోభన్‌బాబు, మాదాల అనిల్, శ్రీహరి, రవికుమార్‌రెడ్డి, బాబుగౌడ్, శ్రీధర్, రజక శేఖర్, జాఫర్, కుళ్లాయప్ప, రమేష్, నరేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.




సమస్యలపై ఆరాతీస్తున్న జేసీ అశ్మిత్‌రెడ్డి

సైకిల్‌గుర్తుకు ఓటువేయండి

తాడిపత్రిటౌన్: వచ్చే ఎన్నికల్లో సైకిల్‌గుర్తుకు ఓటువేసి టీడీపీని గెలిపించాలని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జేసీ అశ్మిత్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని సుంకులమ్మపాలెం, తూర్పుపాలెం, గడియారం ప్రాంతాల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కదిరి శ్రీకాంత్‌రెడ్డి, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం మహిళల ఆందోళన

గుత్తి, మార్చి 26: గుత్తి ఆర్ఎస్‌లో గత రెండు నెలలుగా తాగునీటి సరఫరా లేదోనని దంతో ఎస్సీ, అంబేడ్కర్ కాలనీకి చెందిన మహిళలు మంగళవారం ఆందోళనకు సిద్ధమయ్యారు. స్థానిక పత్తికొండ సర్కిల్‌లో రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేసేందుకు పెద్ద ఎత్తున మహిళలు చేరుకున్నారు. విషయం తెలుసుకున్న అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని మహిళలను నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఈక్రమంలో మహిళలు అధికారులతో వాగ్వాదానికి దిగారు. గత నెల రోజులుగా కొళాయిలకు తాగునీరు సరఫరా చేయకపోతే తామెలా ఏమి తాగాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ అధికారులు స్పందించి సాయంత్రం లోగా ట్యాంకర్ల ద్వారా కాలనీకి నీటిని సరఫరా చేస్తామని, ఆందోళన విరమించాలని వారికి నచ్చచెప్పారు. దీంతో మహిళలు ఆందోళన విరమించారు.



తాగునీటి కోసం అధికారులతో వాగ్వాదం చేస్తున్న మహిళలు

కలిసికట్టుగా టీడీపీ జెండా ఎగురవేద్దాం: అమిలినేని

కళ్యాణదుర్గం, మార్చి 26: నియోజకవర్గంలో టీడీపీ గెలుపు జెండాను ఎగురవేసేందుకు సమష్టిగా కృషి చేద్దామని ఆపార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు పిలుపునిచ్చారు. మంగళవారం శెట్టూరు మండలంలోని ఐదుకల్లు, మంగంపల్లి, యాటకల్లు, గొల్లపల్లి గ్రామాల్లో అమిలినేని సురేంద్రబాబు రోడ్ షో నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఆయన మాట్లాడు తూ సాగు నీరు అందిస్తే అంతర్జాతీయ స్థాయిలో పంటలు పండించే రైతులు కళ్యాణదుర్గం ప్రాంతంలో ఉన్నారన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత కాలువలు పూర్తి చేసి నీటిని తీసుకువస్తామని హామీ ఇచ్చారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. గొర్రెలు, మేకలకు బీమా సౌకర్యం అందేలా చర్యలు తీసుకుంటామ న్నారు. ప్రతి గ్రామానికి సీసీ రోడ్లు వేయడమే కాకుండా పంచాయతీలన్నీ అభివృద్ధి పథంలో నడిచేందుకు కృషి చేస్తామని తెలిపారు. నియోజకవర్గంలోని 114 చెరువులను నీటితో నింపుతామన్నారు. సూపర్‌సిక్స్ పథకాలు అన్ని వర్గాల ప్రజలకు ఎంతో ప్రయోజనం కలిగిస్తాయన్నారు. కంబదూరులో అమిలినేని సురేంద్రబాబు భార్య రమాదేవి ఇంటింటికి వెళ్లి పెద్దఎత్తున ప్రచారాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు.



గజమాలతో సురేంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న మహిళలు



కండువా వేసి టీడీపీలోకి ఆహ్వానిస్తున్న నవీన్‌చౌదరి, లక్ష్మీ నారాయణ

టీడీపీలోకి చేరిక

కంబదూరులో నాలుగు వైసీపీ కుటుంబాలు టీడీపీ పార్టీలోకి చేరాయి. మంగళవారం కంబదూరులో ఇంటింటికి వెళ్లి టీడీపీ నాయకులు సూపర్‌సిక్స్ పథకాలపై ప్రచారం కల్పించారు. అందులో భాగంగా కంబదూరుకు చెందిన నీలి మల్లేశప్ప, పర్చేడు గంగాధర, కావేటి రామకృష్ణ, బెస్త బుడ్డయ్య కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీ లోకి చేరాయి. వీరందరికీ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు అల్లుడు నవీన్ చౌదరి, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి అమిలినేని లక్ష్మీనారాయణ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఎర్రితాతస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే

ఉరవకొండ, మార్చి 26: మండలంలోని వైరాపురం గ్రామంలోని ఎర్రితాత స్వామిని ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ దర్శించుకున్నారు. ఎర్రితాత రథోత్సవంలో భాగంగా ఆలయంలో మంగళవారం స్వామి వారికి రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యేకు అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన పేరిట ఆలయంలో పూజలను చేశారు. బుధవారం రథోత్సవాన్ని నిర్వహించనున్నారు.



స్వామి వారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే

ఎమ్మెల్యేను కలిసిన బంజారా గిరిజన సమైక్య నాయకులు

మండలంలోని కొంకుట్ల గ్రామంలో మంగళవారం ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్‌ను బంజారా గిరిజన సమైక్యనాయకులు కలిశారు. రానున్న ఎన్నికల్లో ఎన్డీఏ కూటమికి మద్దతు ఇవ్వనున్నట్లు తెలిపారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి తరఫున ప్రచారం నిర్వహిస్తామని బీజేఎస్ నాయకులు మహేష్ నాయక్ తెలిపారు.

సజావుగా పదో తరగతి పరీక్షలు

బెళుగుప్ప, మార్చి 26: మండలంలో మంగళవారం పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సజావుగా జరిగినట్లు విద్యాశాఖాధికారి మల్లారెడ్డి తెలిపారు. 76 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని తెలిపారు.

విచారణలో హైడ్రామా

● విచారణ అధికారిని మభ్య పెట్టేలా వ్యవహరిస్తున్న ఆరోపణలున్న అధికారి

కణేకల్లు, మార్చి 26: హెచ్చెల్సీలో హైడ్రామా కొనసాగుతోంది. రెండురోజుల కిందట ఇక్కడ పనిచేసే ఒక జేఈ అవినీతిపై పత్రికల్లో వార్తలు ప్రచురితం కావడంతో విచారణ కోసం ఈఈ వెంకటరమణారెడ్డి కణేకల్లు చేరుకున్నారు. అవినీతి అధికారిపై తిరగబడిన లస్కర్లతో ఈఈ విచారణ చేసేందుకు సిద్ధమయ్యే పరిస్థితిలో ఒక లస్కర్ ఉన్న పళంగా కిందకు పడిపోయి తనకు అస్వస్థతగా ఉందని అధికారులు ముందు పేర్కొన్నాడు. దీంతో విచారణకు వచ్చిన ఈఈ అతన్ని వెంటనే ఆసుపత్రికి పంపాలని సూచించి విచారణను మధ్యలోనే ఆపేశారు. తనకు అనుకూలంగా ఉన్న కొంతమంది లస్కర్లతో ఆ అవినీతి అధికారి ఈ విధంగా హైడ్రామా నడిపించి విచారణను తప్పించుకునేందుకు ప్రయత్నించినట్లు తెలుస్తోంది. అతడికి జిల్లా స్థాయిలో ఉన్న అధికారులు కూడా గట్టిగా మద్దతు ఇస్తుండటంతో ఒక పథకం ప్రకారం ఈ జరుగుతున్నట్లు కనపడుతోంది. అస్వస్థతకు గురై పడిపోయిన లస్కర్ చేత విలేకరులు తనపై తీవ్ర ఒత్తిళ్లు తెస్తున్నట్లు చెప్పించాలనే ప్రయత్నం కూడా సదరు అధికారులు చేస్తున్నట్లు సమాచారం. కాగా అస్వస్థతకు గురైన కణేకల్లు ఆసుపత్రిలో చికిత్స పొందిన లస్కర్ ఆరోగ్య విషయాలను విలేకరులు సేకరించగా అంతా నార్మల్‌గా ఉన్నట్లు వైద్య సిబ్బంది పేర్కొన్నారు. దీన్ని బట్టి చూస్తే అవినీతి అధికారిని కాపాడడానికి పైనుంచి కింది వరకు అందరూ ఎలా సహకారం అందిస్తున్నది తెలుస్తోంది. ఆ అధికారిపై నిష్పక్షపాతంగా విచారణ చేయిస్తే తప్ప హెచ్చెల్సీలో జరుగుతున్న అవినీతి బయట పడే పరిస్థితి లేదని పలువురు రైతులు పేర్కొంటున్నారు.

బాలికల భద్రత.. సామాజిక బాధ్యత

బ్రహ్మసముద్రం, మార్చి 26: బాలికల భద్రత సామాజిక బాధ్యత అని శిశు సంక్షేమ శాఖ అధికారిణి లక్ష్మీప్రసన్న పేర్కొన్నారు. మండలంలోని రాయలప్పదొడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఐసీడీఎస్ మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలికల భద్రత అనే కార్యక్రమాన్ని ఐసీడీఎస్ టీంలీడర్ ఆదినారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముందుగా చిన్నారులకు లఘుచిత్రాల ద్వారా ప్రస్తుత సమాజంలో ఎదురయ్యే సమస్యల్ని ఎలా ఎదుర్కోవాలి, బాల్య వివాహాలు, లైంగిక వేధింపుల గురించి వివరించారు. తొందరో వేసవి సెలవులు మొదలవుతాయి కావున ఆడబిడ్డలు అందరూ జాగ్రత్తగా ఉండాలన్నారు. బాల్య వివాహాలు జరగడానికి అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. బాల్యవివాహాలు చేసినా, సహకరించినా, హాజరైనా ప్రతి ఒక్కరు శిక్షార్హులవుతారన్నారు. ఇందుకు గాను రెండేళ్లు జైలు శిక్ష లేదా లక్ష జరిమానా లేదా రెండూ విధింపబడతాయని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రశేఖర్, రాజగోపాల్, ప్రేమానందం, వెంకటేష్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఖాసింబీ, రామాంజనమ్మ, ఐసీడీఎస్ సమన్వయకర్త జ్ఞానేశ్వరి, మహిళా పోలీసులు రోజా పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో

వైసీపీని గద్దె దింపుదాం

బొమ్మనహాళ్, మార్చి 26: రానున్న ఎన్నికల్లో నిరంకుశ వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దింపి ఇంటికి సాగనంపాలని టీడీపీ నాయకుడు నప్పగిరి సత్యనారాయణ అన్నారు. మంగళవారం బొమ్మనహాళ్ మండలంలోని ఉంతకల్లు గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. కాలవ శ్రీనివాసులు ఇక్కడ ఎమ్మెల్యేగా గెలిస్తే నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ యువనాయకులు అర్ మురళి, ప్రేమ్‌నాథ్, మాజీ ఎంపీటీసీ కెంచప్ప, టీడీపీ నాయకులు మల్లన్న, ఖాసీం తదితరులు పాల్గొన్నారు.



ఉంతకల్లులో టీడీపీ నాయకుల ప్రచారం

సూపర్‌సిక్స్ పథకాలతో అన్ని వర్గాలకు లబ్ధి

బ్రహ్మసముద్రం, మార్చి 26: తెలుగుదేశం పార్టీ ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలతో అన్ని వర్గాలకు లబ్ధి చేకూరుతుందని కళ్యాణదుర్గం నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు కుటుంబ సభ్యులు రాహుల్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కుర్లగుంట, తీటకల్లు గ్రామాలలో మండల పార్టీ కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

గుత్తిరూరల్, మార్చి 26: మండలంలోని తొండపాడు శివారులో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టరును పోలీసులు సీజ్ చేసినట్లు సెబ్ సీఐ శివసాగర్ తెలిపారు. గ్రామానికి చెందిన అరవింద్ చెందిన ట్రాక్టర్ ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా దాడులు నిర్వహించారు. ట్రాక్టర్ నిర్వాహకుడు అరవింద్ పై కేసు నమోదు, ట్రాక్టర్ సీజ్ చేసినట్లు తెలిపారు.

వైసీపీ నాయకుల ఆక్రమణ

కళ్యాణదుర్గం రూరల్, మార్చి 26: వైసీపీ నాయకులు స్థానిక రెవెన్యూ కాలనీలోని సర్వే నెంబర్ 433-4ఏ లో ఉన్న ప్రైవేటు భూమిని కబ్జా చేయడానికి ప్రయత్నించారు. అందులో భాగంగా హిటాచి సాయంతో చదును చేస్తుండగా ప్రైవేటు భూయజమానులు వెళ్లి అడ్డుకున్నారు. ఈ విషయంపై పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. భూమి విషయం కోర్టులో ఉన్నందున ఎటువంటి పనులు చేయకూడదని తెలిపినందుకు మిన్నకుండిపోయారు.



చదును చేసిన భూమి

సైకిల్ గుర్తుకు ఓటు వేయండి: జేసీ

పెద్దవడుగూరు, మార్చి26: సైకిల్ గుర్తుకు ఓటువేసి టీడీపీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మాజీ ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని చింతలచెరువు, తెలికి, మేడిమాకులపల్లి గ్రామాల్లో మంగళవారం ఆయన విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజల యోగక్షేమాలను, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కేశవరెడ్డి, గంగరాజుయాదవ్, కృష్ణారెడ్డి, వెంకటరామిరెడ్డి, ఆదిరెడ్డి, దస్తగిరి, చిరంజీవులు, జయరామిరెడ్డి పాల్గొన్నారు.



జేసీ దివాకర్‌రెడ్డితో చింతలచెరువు గ్రామస్థులు

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన సదస్సు

రాయదుర్గంరూరల్, మార్చి 26: మండలంలోని 74 ఉడేగోళం సమీపంలో ఉన్న కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాసం జీవనకళ, ఆత్మవిశ్వాసం అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ రఘురామమూర్తి పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కౌన్సెలింగ్ సైకాలజిస్టు సౌమ్యశ్రీ హాజరై మాట్లాడారు. అధ్యాపకులు వనజమ్మ, నాగమణి, అనిత పాల్గొన్నారు.

ఘనంగా తిప్పేరుద్రస్వామి రథోత్సవం

బ్రహ్మసముద్రం, మార్చి 26 : మండలంలోని ఎరడికెర గ్రామంలో వెలసిన గురు తిప్పేరుద్రస్వామి రథోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజ నిర్వహించారు. గణపతి పూజ, అభిషేకం, పాలాభిషేకం, రుద్రాభిషేకం, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం అశేష భక్తజన సందోహం మధ్య స్వామివారి ఉత్సవ విగ్రహాలను రథంలో గ్రామంలో వీధుల గుండా లాగారు. ఈ రథోత్సవాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల ప్రాంతాల నుంచే కాకుండా కర్ణాటక రాష్ట్రం నుండి కూడా భక్తులు వచ్చి తమ మొక్కులు తీర్చుకున్నారు.

అన్నివర్గాలకు భవిష్యత్తు గ్యారెంటీ

బెళుగుప్ప, మార్చి 26: టీడీపీ ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలతో అన్ని వర్గాలకు లబ్ధి చేకూరుతుందని టీడీపీ జిల్లా కార్యదర్శి మల్లికార్జున తెలిపారు. మండలంలోని గుండ్లపల్లిలో మంగళవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీపై ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేస్తూ అవగాహన కల్పించారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి పయ్యావుల కేశవ్‌ను గెలిపించాలని కోరారు. శివప్ప, ఓబులేశ్, బాషా తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు దగా

ఉరవకొండ,మార్చి26: వైసీపీ పాలనలో అన్ని వర్గాల ప్రజలు దగా పడ్డారని ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ తనయులు విక్రమ్‌సింహ, విజయ్‌సింహ పేర్కొన్నారు. నియోజకవర్గంలోని వెలిగొండ, పెద్దకౌకుంట్ల, బీళ్లకుర్తి గ్రామాలలో బాబు ష్యూరిటీ, భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమాల్లో వేర్వేరుగా పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. టీడీపీ కూటమి అధికారంలోకి వస్తే ప్రతి పథకం వర్తింప కలిగి లబ్ధిని తెలియజేశారు. ఈ కార్యక్రమాల్లో మండల కన్వీనర్లు సూతేటి వెంకటేష్, టీడీ చిన్నమారయ్య, మాజీ జడ్పీటీసీ తులసీదాస్ నాయక్, మాజీ ఎంపీపీ వెంకటమ్మ, నాయకులు నాగేంద్ర, దసంజయ, మాజీ సర్పంచ్ వెంకటేష్ నాయక్, చీకలగుర్కి సర్పంచ్ పద్మావతి, నాయకులు కంద్యాల నారాయణస్వామి, విజేత, జనసేనపార్టీ నాయకులు పాల్గొన్నారు.

టీడీపీలోకి నాయీ బ్రాహ్మణుల చేరిక

తాడిపత్రిటౌన్, మార్చి26: స్థానిక నివాసంలో టీడీపీ మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో మంగళవారం దాదాపు 500మంది నాయీబ్రాహ్మణులు టీడీపీలో చేరారు. టీడీపీతోనే అభివృద్ధి సాధ్యమని నమ్మి పార్టీలో చేరినట్లు వారు తెలిపారు. పార్టీలో చేరిన వారిలో నాయీబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు రామకృష్ణ, ఉపాధ్యక్షులు రంజిత్, ప్రసాద్, రంగ తదితరులు ఉన్నారు.



పార్టీలో చేరిన వారితో జేసీ ప్రభాకర్‌రెడ్డి

మద్యం విక్రేత అరెస్టు

కళ్యాణదుర్గంరూరల్, మార్చి 26: మండలంలోని హులికల్లు గ్రామ శివారులో కర్ణాటక మద్యాన్ని విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. అతడి నుంచి 120 కర్ణాటక హైవర్డ్ టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

పెద్దవడుగూరు,మార్చి26: మండలంలోని కిష్టిపాడు గ్రామంలో మంగళవారం అక్రమంగా మద్యం అమ్ముతున్న ఓబులేసు నుంచి 8 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. ఓబులేసును అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

తాడిపత్రిలో..

తాడిపత్రిటౌన్: పట్టణంలోని కృష్ణాపురం ఐదో రోడ్డులో అక్రమంగా మద్యం అమ్ముతున్న గోపాల్‌రెడ్డి నుంచి 180ఎంఎల్ సామర్థ్యం గల 39 మద్యం బాటిళ్లను మంగళవారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ గౌస్ బాషా తెలిపారు. పట్టణంలోని బైపాస్‌లో చెందిన గోపాల్‌రెడ్డిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

సారా స్వాధీనం

గుంతకల్లుటౌన్, మార్చి 26: మండలంలోని నెలగొండ గ్రామంలో వెంకటలక్ష్మి నుంచి మంగళవారం రాత్రి సారాను స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్ఐ సురేష్ తెలిపారు. వెంకటలక్ష్మి వద్ద నుంచి పది లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

పెద్దవడుగూరు, మార్చి26: మండలంలోని కోనాపురం సమీపంలోని ముళ్లపొదల్లో పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. వారి నుంచి రూ.11430 స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ముద్దలాపురం సమీపంలో 13 మంది..

కూడేరు: మండలంలోని ముద్దలాపురం గ్రామ సమీపంలోని పేకాట ఆడుతున్న వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్న 13 మందిని అదుపులోకి తీసుకొని వారి నుండి రూ.5,160 స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివరాముడు తెలిపారు.

అనారోగ్యంతో సర్వేయర్ మృతి

పుట్లూరు, మార్చి26: మండలంలోని బాలాపురం గ్రామానికి చెందిన సచివాలయ సర్వేయర్ నారాయణస్వామి (30) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. నారాయణస్వామి గత కొంతకాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ వైద్యం చేయించుకుంటున్నారు. అయినా ఫలితం లేకుండా పోయింది. సర్వేయర్ మృతికి తహసీల్దార్ మల్లికార్జునస్వామి, రెవెన్యూ సర్వేయర్లు సంతాపం తెలిపారు.



నారాయణస్వామి (ఫైల్)

పోలీసుల కవాతు

పెద్దపప్పూరు, మార్చి26: మండలంలోని చిక్కేపల్లి, వరదాయపల్లి, ముచ్చుకోట, చాగల్లు గ్రామాల్లో సీఐ రోషన్ ఆధ్వర్యంలో మంగళవారం కేంద్రబలగాలతో పోలీసులు కవాతు నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో ఓటర్లు నిర్భయంగా, స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకోవడమే లక్ష్యంగా కవాతు నిర్వహించినట్లు సీఐ తెలిపారు.

కిందపడి కార్మికుడు మృతి

తాడిపత్రిటౌన్, మార్చి26: మండలంలోని పోతులయ్యపాలెంలో మంగళవారం ప్రమాదవశాత్తు కిందపడి కార్మికుడు సత్యనారాయణ (39) మృతి చెందాడని రూరల్ పోలీసులు తెలిపారు. వారు తెలిపిన మేరకు కర్ణాటకకు చెందిన సత్యనారాయణ ఉపాధి నిమిత్తం తాడిపత్రికి వచ్చాడు. బండలు పరిచే పనులు చేస్తూ జీవనం సాగించేవాడు. పోతులయ్యపాలెంలో పనులు నిర్వహిస్తుండగా ప్రమాదవశాత్తు పైనుంచి కిందపడి మృతిచెందాడని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

తోటలో అగ్ని ప్రమాదం

కూడేరు, మార్చి 26: మండలంలోని ఉదిరిపికొండ గ్రామానికి చెందిన కురుబ సిద్దలింగప్ప తోటలో మంగళవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో దాదాపు వంద టేకు చెట్లు దెబ్బతిన్నట్లు బాధితుడు తెలిపారు.

ఉరవకొండలో అగ్ని ప్రమాదం

రూ.10 లక్షలు ఆస్తి నష్టం

ఉరవకొండ,మార్చి26: పట్టణంలోని పాత బస్టాండ్‌లో మంగళవారం తెల్లవారుజామున జరిగిన అగ్ని ప్రమాదంలో రూ.10 లక్షల ఆస్తి నష్టం జరిగింది. గడిబి బాబుకు చెందిన గాజుల దుకాణంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. సమీపం లో ఉన్న వ్యక్తులు గుర్తించి అగ్ని మాపక అధికారులకు సమాచారం అందించారు. ఇంతలోనే పక్కనున్న దుకాణాలకు మంటలు వ్యాపించాయి. అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు అక్కడకు చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. కూల్‌డ్రింక్ షాపు, హోటల్‌లోని వస్తువులు కాలి బూడిదై పోయాయి. మొత్తం దుకాణాల్లో దాదాపు రూ.10 లక్షలు ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు.

దుకాణాల్లో చోరీ

పామిడి, మార్చి 26: పట్టణంలో దొంగలు హల్‌చల్ చేశారు. పట్టణంలోని ఎద్దులపల్లి రోడ్డులో గల ఓ మెడికల్ స్టోర్, కిరాణాషాపు, టీ స్టాల్, పోలీస్ స్టేషన్ ఎదురుగా గల కాంప్లెక్స్‌లో మరో నాలుగు షాపుల్లో మంగళవారం తెల్లవారుజామున తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. ఈ సంఘటనల్లో మెడికల్ షాపులో రూ. 200లు, టీ స్టాల్‌లో రూ. 40లు, కిరాణాషాపులో రూ.5వేలు విలువ గల సిగరెట్లు, పోలీసు స్టేషన్ ఎదురుగా ఓ సిమెంట్ కంపెనీ ఆఫీస్‌లో రూ. 1500లు దొంగలు అపహరించినట్లు బాధితులు వాపోయారు. పోలీస్ స్టేషన్ ఎదురుగా గల చెప్పుల షాపు, వరుసల షాపు, డ్రై క్లీనింగ్ షాపు తాళాలను పగుల గొట్టి చోరీకి యత్నించారు. ఈ చోరీలపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ రాజశేఖర్ రెడ్డి తెలిపారు.



చోరీపై విచారణ చేపడుతున్న పోలీసులు